ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 11 నవంబరు 2024

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



- సమస్యలు పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నాం
- నీటి సమస్య లేకుండా చర్యలు
- మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల

ఫటాఫట్

మదనపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెలెక్ట్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న మదనపల్లెలో ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం. నీటి సరఫరా, వీధి లైట్లు, శానిటేషన్, పార్కుల నిర్వహణ, సచివాలయ సేవలపై దృష్టి పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సంయుక్తంగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు అధిగమిస్తూ ముందుకెళుతున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో ప్రజలకు అందుతున్న సేవలు, సమస్యలపై కమిషనర్‌తో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: రానున్న వేసవిలో నీటి సమస్యను ఎలా ఎదుర్కొంటారు?

జవాబు: గత ఏడాది వేసవిలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. నీటి సమస్య ప్రథమంగా ప్రారంభమయ్యే రామారావు కాలనీ, రామిరెడ్డి లేఅవుట్‌లలో ఇప్పటికే కొత్తగా పది బోర్లు తవ్వించాం. వీటి ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తాం. అలాగే బోర్లు, పైపులైన్లు లేనిచోట మున్సిపాలిటీలో ఇప్పటికే ఉన్న నాలుగు ట్యాంకర్లకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తాం. ముందస్తు చర్యల్లో భాగంగా మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లు, చేతిపంపులను ఎప్పటికప్పుడు రిపేర్లు చేస్తున్నాం.

ప్రశ్న: పట్టణంలో అభివృద్ధి పనుల జాడేదీ?

జవాబు: వివిధ కారణాలతో ఇప్పటి వరకు రద్దు చేసిన రూ.6 కోట్ల విలువ చేసే 80 పనులకు టెండర్లు పిలుస్తున్నాం. టెండర్ అంచనాలు రివైజ్ చేసి అంచెలంచెలుగా కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తున్నాం. మున్సిపల్ సాధారణ నిధులతో ఇంతకుముందు ప్యాకేజీ పద్ధతిలో చేపట్టిన ఆరు ప్యాకేజీల్లో రూ.6.50 కోట్లకు ఆన్‌లైన్‌లో బిల్లులు పెట్టాం. ప్రభుత్వం త్వరలోనే బకాయిలు, కొత్తగా చేపట్టే పనులకు నిధులు విడుదల చేయనుంది.

ప్రశ్న: పట్టణంలో అంధకారం మాటేంటి?

జవాబు: పట్టణంలో అక్కడక్కడా వీధిలైట్లు వెలగడం లేదని కౌన్సిలర్లు, ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు వస్తున్నాయి. వీటిని పరిష్కరించేందుకు లైటింగ్ సామగ్రి కొనుగోలుకు రూ.9.50 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు పిలిచాం. లైట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. మరమ్మతులకు గురైన లైట్లను రిపేరు చేయడం, పనిచేయని వాటిస్థానంలో కొత్తగా ఏర్పాటు చేసే ప్రాంతాల్లో కొత్తలైట్లు వేస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్యాన్ని ఎలా మెరుగు పరుస్తారు?

జవాబు: గతంతో పోలిస్తే పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి మెరుగుపడిందనే చెప్పాలి. వీటిపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు కూడా బాగానే తగ్గాయి. ప్రతిరోజూ ఇంటింటా వెళ్లి ఆటోల ద్వారా చెత్తసేకరణ చేస్తున్నాం. అదనపు కార్మికులను తీసుకోవడం ద్వారా సమస్యను అధిగమించామని అనుకుంటున్నాం.

ప్రశ్న: ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కుల నిర్వహణ?

జవాబు: పట్టణంలో ప్రధానంగా చెప్పుకునే ఎన్వీఆర్ పెద్ద పార్కు, సొసైటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ పార్కులు కార్మికులతో రోజువారీ నిర్వహణ చేస్తున్నాం. వీటిల్లో చిన్నపిల్లలు ఆడుకునే కొన్ని పరికరాలు రిపేర్లకు వచ్చాయి. ప్రస్తుతం వాటిని కాంట్రాక్టర్‌తో చేయిస్తున్నాం. రామ్‌నగర్ పార్కును కూడా కొంతవరకు క్లీన్ చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే రామ్‌నగర్ పార్కుతో పాటు రామారావు కాలనీ పార్కులో పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తెస్తాం.

ప్రశ్న: పనిచేయని సచివాలయాలను ఎలా గాడిలో పెడతారు?

జవాబు: సచివాలయ ఉద్యోగులు రోజువారీ క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా ప్రజలకు సేవలు అందించేలా పర్యవేక్షిస్తున్నాం. మున్సిపాలిటీలోని వివిధ సెక్షన్ అధికారులకు రెండు, మూడు వార్డు సచివాలయాలకు నోడల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించాం. వారు రోజువారీ ర్యాండమ్‌గా సచివాలయాలను తనిఖీ చేస్తున్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులు ఇంటింటా హౌస్‌హోల్డ్ సర్వే చేస్తున్నారు. సరైన కారణం, పర్మిషన్ లేకుండా, విధులకు డుమ్మా కొట్టినా, సక్రమంగా విధులకు రాకపోయినా చర్యలు తీసుకుంటాం.

వసూల్ రాజా..







ఆయన జిల్లాలో ఓ ప్రభుత్వ శాఖకు ముఖ్యమైన సార్. కొత్తగా జిల్లా ఏర్పడినపుడు ఈ జిల్లాకు వచ్చిన ఆ సార్ కత్తికి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాకుండా కూటమి ప్రభుత్వంలోనూ అడ్డే లేకుండాపోతోంది. తన కింద పనిచేసే సిబ్బంది నుంచి రూ.లక్షలు వసూలు చేశారని, ఆ సార్‌కు ప్రతినెలా కింది స్థాయి సిబ్బంది మామూళ్లు ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులకు పూర్తి స్థాయిలో కొమ్ము కాస్తూ, రాయచోటిలో వైసీపీ కార్యాలయానికి ప్రభుత్వం నుంచి వచ్చిన 2 వేల సిమెంట్ బస్తాలను తరలించారనే ఆరోపణలు ఉన్నాయి . ఇవన్నీ తెలిసినా.. పత్రికల్లో కథనాలు వచ్చినా ఆ సార్‌పై ఎందుకో కూటమి ప్రభుత్వంలోనూ చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ ఆయన ఆ శాఖలో చక్రం తిప్పుతున్నారు.

- సిమెంట్, కడ్డీలు భోంచేశాడు..
- పాత ఇళ్లకు కొత్తగా బిల్లులు
- వైసీపీ కార్యాలయానికి 2 వేల సిమెంట్ బస్తాలు
- కుప్పలు తెప్పలుగా అక్రమాలు
- గతంలో వైసీపీకి కొమ్ము కాసి.. నేడూ చక్రం తిప్పుతున్నారు..
- కూటమి ప్రభుత్వంలోనూ ఆ సార్‌పై నో యాక్షన్

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న సాంబశివయ్య అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి అధికారిగా వచ్చారు. ఇక్కడ అధికారిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచీ ఆయనపైన అనేక ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. అప్పటి జగన్ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం అమలు చేయడంలో సమర్థవంతంగా పనిచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. పనితీరులో సమర్థత గురించి పక్కన పెడితే.. తన కింద పనిచేసే సిబ్బంది నుంచీ విపరీతంగా మామూళ్ల వసూళ్లు చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. పేదలకు ఇళ్లు మంజూరు చేయడం, లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సిమెంటు, కడ్డీలు, ఇసుక సక్రమంగా ఇవ్వకపోయినా ఈయన పట్టించుకునే వాడు కాదనే ఆరోపణలు ఉన్నాయి. మండల స్థాయిలో పనిచేసే సిబ్బంది నుంచి నెల నెలా మామూళ్ల వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మామూళ్లను తాను ఎప్పుడూ చేతికి తీసుకునేవాడు కాదని, తన దగ్గర పనిచేసే సిబ్బంది చేతికి, లేదా వాళ్ల బ్యాంకు అకౌంట్లలోకి వేయించేవాడని తెలుస్తోంది. ఆధారాలతో సహా దొరికిన ఆయన అక్రమాలు కొన్ని పరిశీలిస్తే..

భార్య, కొడుకు ఫోన్‌పే అకౌంట్లకు డబ్బు

తన శాఖలోని మండల ఇన్‌చార్జ్‌లు పలువురి దగ్గర ప్రతి నెలా మామూళ్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు పెద్ద ఉదాహరణగా.. ఆయన భార్య, కొడుకు ఫోన్‌పే అకౌంట్లకు డబ్బు వేయడమే. ఆయన భార్య పావని (2023 నవంబరు 20, 21 తేదీలలో) కొడుకు రెడ్డిసాయి పేరు మీద కూడా ఇదే రోజుల్లో ఫోన్‌పేకు ఎంబీసీ శివశంకర్ పంపించాడు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఏఈలు ఇలా పలువురు సిబ్బంది వేలాది రూపాయలు మామూళ్లు సమర్పించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వసూలయ్యే మొత్తాన్ని తన చేతులకు మట్టి అంటకుండా తన కింద పనిచేసే సిబ్బంది బ్యాంకు అకౌంట్లలో వేసుకుని.. తర్వాత తీరిగ్గా తీసుకునేవాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈయన కారు డ్రైవర్ అకౌంటుకు 2023 మార్చి 15 నుంచి 2024 జూన్ వరకు రూ.7,79,000 జమ అయింది. ఇందులో 2023 మార్చి 15న ఒకసారిగా రూ.2,37,000 జమ అయింది. ఇంత మొత్తం అతడి బ్యాంకు అకౌంటుకు ఎందుకు వచ్చింది? ఎలా వచ్చిందో? అధికారులే విచారించాలి.

పది వేలకు పైగా పాత ఇళ్లకే బిల్లులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలలో సుమారు 70 వేల ఇళ్లు ఇచ్చింది. ఇందులో అర్హులకు ప్రభుత్వమే స్థలం ఇచ్చి సిమెంటు, కడ్డీలు, ఇసుక ఇచ్చి ఇళ్లు నిర్మింపచేయడం ఒకటైతే.. సొంత స్థలం ఉన్న లబ్ధిదారునికి కూడా సిమెంటు, కడ్డీలు, ఇసుక ఇవ్వడం. ఈ పథకాన్ని ఈయన ఆదాయవనరుగా మార్చుకున్నారని, జిల్లా వ్యాప్తంగా సుమారు పదివేలకు పైగా పాత ఇళ్లకు కొత్తగా బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఇల్లు నిర్మాణంలో పునాది, గోడలు, స్లాబు, ఇల్లు పూర్తవడం ఇలా ప్రతి దశలోనూ జియోట్యాగ్ చేయాలి. ఆయా దశలను బట్టి లబ్ధిదారులకు బిల్లు పడుతుంది. అయితే రాయచోటి డివిజన్‌లోని రామాపురం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం మండలాలలో కొత్తగా ఇల్లు కట్టకుండానే సుమారు 1500 పాత ఇళ్లకు బిల్లులు చేసేశారు. ఈ ఇళ్లకు ఇవ్వాల్సిన సిమెంటు, కడ్డీలను పక్కదారి పట్టించారు. ఎప్పుడో కట్టిన ఇళ్లకు బిల్లులు పెడుతుండటంతో లబ్ధిదారులు కూడా సిమెంటు, కడ్డీల కోసం పట్టుబట్టకుండా వచ్చినకాడికి చాలని అనుకున్నట్లు సమాచారం. దీంతో స్టాకు రిజిస్టర్‌లో సిమెంటు, కడ్డీలు లబ్ధిదారులకు ఇచ్చినట్లు రాసినా ఎవరూ కిక్కురమనడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వైసీపీ కార్యాలయానికి 2 వేల సిమెంట్ బస్తాలు

లబ్ధిదారుల నోళ్లు కొట్టి ఉన్న ఇళ్లకే బిల్లులు చేసి అక్రమాలకు పాల్పడి నిల్వ చేసిన సుమారు 2 వేల సిమెంటు బస్తాలను రాయచోటిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయానికి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా పలుచోట్ల మండల స్థాయి వైసీపీ నాయకులకు సైతం సిమెంటు, కడ్డీలు సమర్పించుకున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కాబట్టే జగన్‌రెడ్డి పాలనలో ఈయన ఎన్ని అక్రమాలు చేసినా, ఎంత అక్రమ వసూళ్లకు పాల్పడినా ఈయన మీద ఎటువంటి చర్యలూ లేవు. అయితే కూటమి ప్రభుత్వంలో ఈయన అక్రమాలకు తగిన శిక్ష పడుతుందని అందరూ ఊహించారు. బదిలీతో సరిపెట్టకుండా.. ఇంకా కఠినమైన శిక్షలు తప్పవని అనుకున్నారు. అయితే ఏం జరిగిందో? ఏ అదృశ్యశక్తి అడ్డుకుందో? ఈయన పైన కనీసం ఈగ కూడా వాలడం లేదు. పేపర్లలో వార్తలు వచ్చినా..? ప్రజాసంఘాలు ఆందోళనలు చేసినా..? ఎటువంటి చర్యలూ లేవు.

ప్రత్యేకాధికారితో విచారణ జరిపిస్తేనే..

ఈయన అక్రమాలపై ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఓ ప్రత్యేకాధికారితో విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. తన కింద పనిచేసే సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల ఇన్‌చార్జ్‌ల బ్యాంకు అకౌంట్లను, ఫోన్‌పే అకౌంట్లను పరిశీలించాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివయ్యను వివరణ కోరగా నాపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదు. ఫోన్‌పేలో డబ్బులు వేసిన విషయం వాస్తవమేనని.. అయితే మా డ్రైవర్ పిల్లలకు ఆరోగ్యం సరిగ్గా లేదంటే నా జీతం డబ్బు రూ.40 వేలు తీసి ఇచ్చానని, ఆ డబ్బునే తిరిగి వాళ్లు ఫోన్‌పేలో పంపారని చెప్పారు.

ఏం కష్టమొచ్చిందో పాపం..

ఆ చిన్నారికి ఏం కష్టమొచ్చిందో పాపం.. బాధను పంటి బిగువన దిగమింగుకుని డార్మిటరీలోని ఐరన్‌కాట్‌కు టవల్‌ను బిగించి ఉరి వేసుకుని చనిపోయాడు. అంతవరకు తమతో పాటే వంట పనుల్లో సాయం చేసిన ఆ చిన్నారి అనంతరం విగతజీవిగా మారిపోవడంతో సహచర విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గురుకులంలో 5వ తరగతి చదువుతున్న రెడ్డిమోక్షిత్ అనే విద్యార్థి మృతి చెందడం పీలేరులో కలకలం రేపింది.



రెడ్డి మోక్షిత్ మృతదేహం



విలపిస్తున్న రెడ్డి మోక్షిత్ తల్లి వాణి

- గురుకులంలో 5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య
- ఆర్డీవో, డీఈవో విచారణ

పీలేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర గురుకులం)లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం అటు కేవీపల్లె, ఇటు పీలేరు మండలాల్లో కలకలం రేపిం ది. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం చిన్నగొట్టిగల్లు గ్రామం దిగువవీధికి చెందిన డి.కృష్ణమూర్తి, డి.వాణి కుమారుడు డి.రెడ్డిమోక్షిత్ (10) గ్యారంపల్లెలోని బాలుర గురుకులంలో 5వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి తల్లిదం డ్రులు రోజువారీ కూలీ పనులకు వెళుతుంటా రు. రోజూ లాగే ఆదివారం కూడా ఉదయాన్నే నిద్రలేచిన రెడ్డిమోక్షిత్ సహచర విద్యార్థులతో కలిసి కాసేపు పాఠశాల హాస్టల్‌లో వంట పను ల్లో సాయం అందించాడు. ఒక్కసారిగా డార్మిటరీలోకి వెళ్లి తన టవల్‌తో ఐరన్ కాట్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను గుర్తించిన ఇతర విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. ఆస్పత్రిలో ఆ విద్యార్థి తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి చేరుకుని రెడ్డి మోక్షిత్ కుటుంబీకులను ఓదార్చారు. తమ బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో సంఘటనపై సమగ్ర విచారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారని, విచారణలో తప్పు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారికి నచ్చజెప్పారు. అనంతరం ఆయన అక్కడే ఉన్న గురుకులం ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని డీఈవో సుబ్రహ్మణ్యంతో కలిసి విచారించారు. అయితే రెడ్డి మోక్షిత్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, డీబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు, స్థానిక ప్రజాసంఘాల నేతలు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. డీఈవో సుబ్రహ్మణ్యం ఆదివారం సాయంత్రం గ్యారంపల్లెలోని గురుకులానికి చేరుకుని సంఘటనపై ఉపాధ్యాయులను విచారించారు. ఈ సంఘటనపై ఆర్డీవో మాట్లాడుతూ రెడ్డి మోక్షిత్ మృతి సంఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించారని, పోస్టుమార్టం నివేదిక అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.



గ్యారంపల్లె గురుకులం సిబ్బందిని విచారిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, డీఈవో బాలసుబ్రహ్మణ్యం

హార్సిలీహిల్స్‌లో డీఐజీ కోయప్రవీణ్

బి.కొత్తకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు రాయలసీమ రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తిరుమలకు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణం లో రాత్రికి హిల్స్‌కు చేరుకున్నారు. ఆయనకు స్థానికంగా ఉన్న పోలీస్ అతిథిగృహంలో బస ఏర్పాట్లు చేశారు. మదనపల్లి డీఎస్పీ కొండయ్యనాయుడు, బి.కొత్తకోట సీఐ రాజారెడ్డిలు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుంకుమ పువ్వు ఘుమ..ఘుమలు...

- మంచుకొండల పంట మదనపల్లెలో సాగు
- అగ్రికల్చర్ విద్యార్థి శ్రీనిధి వినూత్న ఆలోచన
- మూడేళ్లుగా మంచి ఫలితాలిస్తున్న పంట

చల్లటి ప్రదేశాల్లో సాగయ్యే కుంకుమపువ్వు పంట మదనపల్లెలో సాగవుతోంది. అగ్రికల్చర్ విద్యార్థి శ్రీనిధి వినూత్నంగా ఆలోచించి తన ఇంటిలోనే ఈ పంటను సాగు చేస్తోంది. మూడేళ్ల నుంచి ఈ పంటను సాగు చేస్తూ సాంకేతికతను అందిపుచ్చు కుంటూ సత్ఫలితాలను సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

6



ట్రేలో సాగు చేస్తున్న కుంకుమపువ్వు పంట

గెలుపే లక్ష్యంగా పరిగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
- అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరిగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు సంబంధిత రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అదితిసింగ్ హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి జేసీ మాట్లాడారు. అగ్నివీర్ ఆర్మీలో జాయిన్ అయ్యేందుకు జరిగే ఎంపికలకు ఇప్పటికే రాత పరీక్ష పూర్తయిందన్నారు. అందులో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్ట్‌కు హాజరై కడపకు వచ్చిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలిపారు. ర్యాలీలో పాల్గొనే ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించే ఈ ఎంపికలో అభ్యర్థులు విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు ఎవ్వరూ దళారులను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్, అనుబంధ సంఘాల అధికారులు పాల్గొన్నారు.

కాగా.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000 మంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కానున్నారు. వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనే విషయమై ముందస్తుగా వారికి ఆర్మీ అధికారులు కాల్ లెటర్స్ పంపించారు.



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



వివరాలను నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు







మంచుకొండల పంట.. మదనపల్లె ఇంట..

సాధారణంగా కుంకుమ పువ్వు అనగానే ప్రతి ఒక్కరికీ కశ్మీర్ గుర్తొస్తుంది. ఇంచుమించు అలాంటి వాతావరణమే ఉన్న మదనపల్లెలో ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనే ఓ అగ్రికల్చర్ విద్యార్థినికి వచ్చింది. ఇక వెనక్కు తిరిగి చూడకుండా వినూత్న సాగుకు సిద్ధమైంది. పంటను కంటికి రెప్పలా చూసుకుంటూ మూడేళ్లుగా మంచి ఫలితాలను సాధిస్తోంది. తెలుగురాష్ట్రాల్లో చాలా అరుదుగా సాగయ్యే పంట మదనపల్లెలో అందుబాటులో ఉండడంతో పట్టణవాసులే కాకుండా జిల్లా వాసులు ఆ విద్యార్థినిని శభాష్ అని అభినందిస్తున్నారు.

- అగ్రికల్చర్ విద్యార్థిని శ్రీనిధి వినూత్న ఆలోచన
- మూడేళ్లుగా మంచి ఫలితాలు
- శభాష్ అంటున్న జిల్లావాసులు

మదనపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచుకొండల మధ్య చల్లటి ప్రదేశాలైన జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో మాత్రమే సాగయ్యే కుంకుమపువ్వు పంట ప్రస్తుతం మదనపల్లెలో సాగవుతోంది. పట్టణ శివారు ప్రాంతం చిప్పిలికి చెందిన పువ్వు శ్రీకాంత్‌రెడ్డి, పువ్వు భార్గవి దంపతుల కుమార్తె పి.శ్రీనిధి ఈ పంట సాగు చేస్తున్నారు. ఒకటి కాదు..రెండు కాదు..వరుసగా మూడేళ్లు పట్టువదలని విక్రమార్కునిలా పంట సాగు చేయడమే కాదు.. ఏటికేడు సాగులో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకెళ్తున్నారు. అందరిలాగా ఫలితాల కోసం పాకులాడకుండా, లాభం కోసం ఎదురుచూడకుండా, పంట సాగునకు అనుకూలమైన ఇక్కడి వాతావరణంలో సాగు మరింత విస్తరించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒకటి రెండు చోట్ల అక్కడక్కడా సాగయ్యే కుంకుమ పువ్వు సాగును పదిమంది రైతులకు పరిచయం చేయడానికి పరితపిస్తున్నారు. ఇందుకోసం కుంకుమ పువ్వు కంటే విత్తనం ఉత్పత్తికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కేవలం మూడు నెలల వ్యవధితో చేతికొచ్చే ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది.


ట్రేలో సాగుచేస్తున్న కుంకుమ పంట


కుంకుమ రేఖలు


వేరు చేసిన కుంకుమ రేణువులు

స్నేహితుడు.. తల్లిదండ్రుల సహకారం

తనతో పాటు బెంగళూరు యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన తన స్నేహితుడు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనిధి తల్లిదండ్రుల సహకారంతో మూడేళ్లుగా నిరాటంకంగా పంట సాగు చేస్తున్నారు. మొదటగా 2022 ఆగస్టులో విత్తనాన్ని జమ్మూ-కశ్మీర్ నుంచి తెప్పించారు. పంట సాగుకోసం మొదట రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. పంటసాగులో జమ్ము-కశ్మీర్, హర్యానా యూనివర్సిటీ ప్రొఫెసర్ల నుంచి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తీసుకుంటూ మొదలు పెట్టగా, ప్రస్తుతం శ్రీనిధి అన్నీ తానే స్వయంగా చూసుకుంటున్నారు. ఏటా ఆగస్టులో నాటే ఈ పంట కేవలం మూడు నెలల వ్యవధిలోనే అంటే నవంబరులో పూర్తవుతుంది. అంచెలంచెలుగా వికసించే పుష్పాలను ఎప్పటికప్పుడు కోస్తూ, రేఖలు, అందులోని పుష్పరేణువులను వేరు చేస్తారు. ఇందులో రేణువుల నుంచి కుంకుమ పువ్వు తీస్తుండగా, రేఖలను కూడా ఇతర అవసరాలకు మార్కెట్ చేస్తున్నారు.

విద్యాభ్యాసం

బెంగళూరు యూనివర్సిటీలో సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేటర్ (అగ్రికల్చర్) బీఎస్సీ పూర్తి చేసిన శ్రీనిధి ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి తర్వాత ఎస్వీ యూనివర్సిటీలో అదే విభాగంలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. తర్వాత అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ చేయాలని మొదట అనుకున్నా జీవితంలో ఏదో ఒకటి సాధించాలని సంకల్పించారు. తాను ఎంచుకునే ప్రాజెక్ట్‌ను రొటీన్‌కు భిన్నంగా ఉండాలని ప్రత్యేకంగా ఆలోచించారు.

సాగు విధానం

240 చ.అ.విస్తీర్ణం గల గదిలో 340 ట్రేలు ఏర్పాటు చేయగా, ఒక్కో ట్రేలో విత్తన పరిమాణాన్ని బట్టి 100 నుంచి 130 విత్తనాలు అమరుస్తున్నారు. 2022 నుంచి 2024 వరకూ క్రమంగా 150 గ్రాములు, 200 గ్రాములు, 400 గ్రాముల కుంకుమ పువ్వును ఉత్పత్తి చేశారు. రోజువారీ కోసిన పుష్పాల నుంచి రేఖలు, స్టిగ్మాను వేరు చేసి కుంకుమ పువ్వును పక్కకు తీసి ఆరబెడతారు. సాగు చేసిన ప్రతీ విత్తనం ఫెయిల్ కాకుండా పువ్వు పూస్తే పంట దిగుబడి పెరుగుతుంది. అలాగే విత్తనం పరిపుష్టిగా ఉంటే రెండు పువ్వులు కూడా పూస్తుంటాయి. కుంకుమ పువ్వు మార్కెట్‌లో గ్రాము ధర రూ.500 నుంచి రూ.700 పలుకుతోంది. మిగిలిన పసుపు స్టిగ్స్, రేఖలను ఇతర అవసరాలైన స్వీట్స్, కాస్మెటిక్‌లలో ఉపయోగిస్తారు. ఇటీవల వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో జమ్మూ-కశ్మీర్‌లోనూ ఇండోర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. విత్తనాన్ని మరింత ఉత్పత్తి చేసే క్రమంలో కృత్రిమ వాతావరణంలో కాకుండా సాధారణ వాతావరణంలో మంచి పోషకాలు ఇచ్చి విత్తనం పరిమాణం పెద్దదిగా ఉండేలా పరిశోధనలు చేస్తున్నారు.


వికసించిన పుష్పం

ఇక్కడెందుకు సాగు చేయకూడదు

- పి.శ్రీనిధి, నిర్వాహకురాలు, మదనపల్లె



కశ్మీర్‌లోనే పండించే పంట ఇక్కడ ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచన నాకు వచ్చింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకుంటూ మూడేళ్లుగా సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది వచ్చే ఇబ్బందులు, సమస్యలను అధిగమిస్తూ, పంట సాగులో మెలకువలు పాటిస్తూ పురోగతి సాధిస్తున్నా. ఇతర రాష్ట్రాల్లోనూ అతి తక్కువగా సాగవుతున్న పంట ఇది. ఇందులో లాభం కంటే వాటి విత్తనాలు ఉత్పత్తి చేయాలన్నదే నా ప్రధాన ఉద్దేశ్యం.

ప్రత్యేకగది.. కోల్డ్ స్టోరేజ్

జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల సెల్సియస్ నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌లో ఉంటాయి. అలాంటి వాతావరణంలో మాత్రమే కుంకుమ పువ్వు సాగవుతుంది. ఇలాంటి వాతావరణాన్నే ఇక్కడ పంట సాగునకు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో తన నివాసంలోని ప్రత్యేక గదిలో చిల్లింగ్ కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన ఆ గదిలో వాతావరణాన్ని ఎప్పటికప్పుడు పరికరాలతో పరిశీలిస్తూ, ఉష్ణోగ్రతలో ఏమాత్రం తేడా లేకుండా చూస్తున్నారు. హైజినిక్ కండీషన్‌లో పాలీయూరేటెడ్ ఫైబర్, థర్మాకోల్ ఇన్సులేషన్‌తో ఇండోర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. గాలిలో తేమ ఆధారంగా ఆర్గానిక్ పద్ధతిని అవలంబిస్తున్నారు. విత్తనం ఏడు గ్రాములుంటే ఒక పువ్వు, పది గ్రాములు ఆపై ఉంటే రెండు పూలు పంట దిగుబడి వస్తున్నట్లు నిర్వాహకురాలు చెబుతున్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


గుర్రంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని కాపాడిన సీఐ

బి.కొత్తకోట, నవంబరు 10: క్షణికావేశంలో తనువు చాలించబోయిన యువకుడి ప్రాణాలు బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి కాపాడారు. పోలీసుల కథనం మేరకు... గొల్లపల్లె పంచాయతీ గుడిసివారిపల్లె వాసి జీవన్‌రెడ్డి చదువు పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంటున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన ఓ కంపెనీ ఉద్యోగి కడప వాసి రంజిత్‌రాయల్ మాటలు నమ్మి రూ.2లక్షలు డబ్బు చెల్లించాడు. అయితే అతను నమ్మించి మోసం చేశాడని గ్రహించి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం బాగా పొద్దుపోయాక తన తల్లికి ఫోన్ చేసి తాను మోసపోయానని, ఇక జీవించాలను కోలేదని, ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. దీంతో తల్లి తనకు అందుబాటులో ఉన్న బంధువులందరికీ చెప్పినా ఫలితం లేకపోయింది. చివరికి సీఐ రాజారెడ్డికి సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన సీఐ లోకేషన్‌ను కనిపెట్టాడు. వెంటనే సిబ్బందితో పాటు వెళ్లి జీవన్‌రెడ్డిని పట్టుకున్నారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు. తప్పులు చేయడమే కాకుండా కుటుంబీకులను బాధితులను చేయడం, పైగా ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తన బిడ్డ ప్రాణాలు కాపాడినందుకు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను సత్కరించారు.


సీఐ రాజారెడ్డిని సత్కరిస్తున్న జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు



కమనీయం.. అగస్త్యేశ్వర క్షేత్రం

- భక్తులకు కొంగు బంగారం
- కొండకోనల నడుమ వెలసిన శైవక్షేత్రం
- మహర్షుల పాద ధూళితో పునీతం

మైలవరం, నవంబరు 10: సుందరమైన కొండ కోనలు, వాగు వంకలు, పచ్చిక బయళ్లు ప్రకృతి సిద్ధమైన గుహలు ఇలా కమనీయ, రమణీయ దృశ్యాలతో అగస్త్యేశ్వర క్షేత్రం అలరారుతోంది. కాగా సకల వ్యాధి నివారణ క్షేత్రంగా శ్రీ అగస్త్య మహాముని కఠోర దీక్ష తపో భూమి అయిన ఈ క్షేత్రం భక్తుల పెన్నిధిగా ఉంటోంది. ముఖ్యంగా కార్తీక మాసం, శివరాత్రి సమయాల్లో భక్తుల సందడితో ఈ క్షేత్రం కళకళలాడుతోంది. రాయలసీమలోని దండ కారణ్యంలో ఎందరో మహానుభావుల, మహర్షుల పాద ధూళితో పునీతమైన ఈ అగస్త్యేశ్వర క్షేత్రం అత్రిముని కోనగా కూడా విరాజిల్లుతోంది.

దివ్య కొలను.. ఔషధ జలం...

అనేక రాజ్యాల రాజకీయ చతురతను, వీర విహారాన్ని గుర్తుకు తెస్తూ సాక్షి భూతంగా నిలిచిన గండికోటకు అతి సమీపంలో లోయ, అవతలి వైపు కొండలో వెలసిన అగస్త్యేశ్వర క్షేత్రంలో స్వయం సిద్ధంగా పుట్టిన పిల్ల కాలువలతో, వన మూలికలతో దివ్య ఔషధమైన జలాన్ని నింపుకున్న కొలను ఇక్కడ ఉంది. ఈ కొలనులో అగస్త్య మహాముని ప్రతి రోజు స్నానం ఆచరించి జప తపాలు చేసినట్లు స్థల పురాణం వల్ల తెలుస్తోంది. ఎందరో అనారోగ్య పీడితులు ఈ కొలనులో స్నానం ఆచరించి స్వస్థత పొందుతున్నట్లు ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటున్నారు.

మాతృత్వాన్ని ప్రసాదించే ఆదిశేషుడు

దుర్గా సుబ్రమణ్యేశ్వర వర ప్రసాదంగా, అగస్త్య మహాముని తపో ఫలితంగా వెలసి కోరిన వరాలు ఇస్తూ సంతానం లేని వారికి మాతృత్వాన్ని కలిగిస్తున్న ఆదిశేషుని నివాసం (బ్రహ్మాండమైన పుట్ట) మహిళల కలలను సాకారం చేస్తున్నట్లు భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పుట్టకు 40 రోజుల పాటు ప్రదర్శనలు చేసి సంతానం లేనివారు ఎందరో మాతృ సౌభాగ్యం పొందుతున్నట్లు ప్రజల విశ్వాసం.

జమ్మలమడుగు నుంచి అగస్త్యేశ్వర కోనకు ఆర్టీసీ వారు బస్సుసౌకర్యం కల్పించడంతో రోజు రోజుకు సందర్శకుల రద్దీ పెరుగుతోంది. ఇక్కడ భక్తాదుల నివాసానికి వసతి, భోజన సదుపాయాలతో ఈ క్షేత్రం నిత్య నూతనంగా విరాజిల్లుతోంది. కార్తీక మాసం, దత్త జయంతి, నవరాత్రి ఉత్సవాలు, అలాగే ధనుర్మాసంలో విశేష పూజలు ఘనంగా జరుగుతాయి. ముఖ్యంగా ఈ క్షేత్రం కార్తీక మాసం, శివరాత్రి పర్వదినాల సందర్భంగా భక్తజన సందోహంతో కోలాహలంగా తిరునాల వాతావరణంలో ఉంటుంది.


అలయ ఆవరణంలోని దివ్య కొలను


ఆలయంలోని శివలింగం

క్షేత్ర మహిమ

మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో కొండల నడుమ ఈ అగస్త్యేశ్వర క్షేత్రం ఉంది. త్రేతా యుగంలో అగస్త్య మహాముని దేశ సంచారంలో భాగంగా దక్షిణదిశగా వెళ్తూ మార్గం మధ్యలో అనేక చోట్ల శివలింగాల ప్రతిష్ఠలు చేసి తపస్సు కొనసాగిస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో దండ కారణ్యమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి అగస్త్య కోనలో అడుగుపెట్టారు. ఇక్కడ మనో సిద్ధి కోసం ధర్మపత్ని లోపముద్రతో కూడి పరమేశ్వరానుగ్రహానికై దుర్గా సుబ్రమణ్యేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠ గావించి ఘోర తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.





శివపూజకోసం..

కార్తీకమాసం కావడంతో శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. కొండకోనల్లో కొలువైన శివుని దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివెళుతున్నారు. కార్తీక వనభోజనాలూ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీనికి తగినట్టు జిల్లాలోని పెండ్లిమర్రి, పులివెందుల, ఖాజీపేట మండలాల్లో పూలతోటల్లో రైతులు బిజీగా ఉన్నారు. కూలీలను పెట్టి పూలను కోసి అమ్మకాలకు తరలిస్తున్నారు. రోడ్డుపక్కన కళకళలాడుతున్న సువాసనల విరులు ఆ మార్గంలో వెళ్లేవారికి కనువిందు చేస్తున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప





రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- ఇరువురికి స్వల్పగాయాలు

సిద్దవటం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చిరంజీవి వివరాల మేరకు.. మండలంలోని వడ్డిపల్లె గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు రెండు ద్విచక్ర వాహనాల్లో ఇద్దరు చొప్పున ఆదివారం కడపకు వెళుతున్నారు. కడప - చెన్నై రహదారిలోని భాకరాపేట మల్లిలేనిపట్నం మలుపు వద్దకు రాగానే కడప వైపు నుంచి రాజంపేటకు వేగంగా వెళుతున్న కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు ఢీకొన్న బైకులో కిరణ్‌కుమార్(17), శేషాద్రి(18)లకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక వస్తున్న మరో బైకులో ఉన్న వర్ధన్, బాలు అనే ఇరువురికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. నలుగురిని వైద్య చికిత్సల నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతిచెందినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేషాద్రిని మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిరణ్ (ఫైల్ ఫొటో)

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు




ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కార్యవర్గంతో ఆస్కార్‌రావు

కడప మారుతీనగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకులు మారుతు న్నా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాలకుల తీరు కారణంగా రోజురోజుకూ ఉద్యోగులపై భారం ఎక్కువ అవుతోందన్నారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల ముఖ ఆధారిత విధానాన్ని అటెండెన్స్‌తో పాటు వాటి ఆధారంగా జీతభత్యాల నిర్ణయం, కోతలు విధించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంలపై ఇటు ఆరోగ్యశాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల పెత్తనం ఎక్కువ కావడం సరైందికాదన్నారు. ముఖ్యంగా వైద్య ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకపోగా పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తదనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.విన్సెంట్‌కుమార్, కార్యదర్శిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్ వరప్రసాద్, శివ, సంయుక్త కార్యదర్శులుగా విజయలక్ష్మి, లక్ష్మీదేవి, నాగేశ్వరి, రామసుబ్బారెడ్డి, ఏసుపాదం, సుధాకర్, అన్నపూర్ణ, నియమితులయ్యారు.

బడికి దూరంగా...

● చదువుకు దూరమవుతున్న లక్షలాది మంది పిల్లలు
● జిల్లాలో బడిబయట పిల్లల సంఖ్య 15807 మంది
● చర్యలకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం
● అర్హత ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు పాఠశాల విద్యకు ఖర్చు చేస్తున్నా వాటి ఫలితాలు పూర్తిస్థాయిలో కనిపించడంలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువులకు దూరమవుతున్న పిల్లల పట్ల కనీస చర్యలు చేపట్టకపోవడం.. పాఠశాలల్లో లేని పిల్లలను కూడా ఉన్నట్లు గతంలో చూపించడం.. తదితర కారణాలతో ప్రస్తుతం లక్షలాది మంది పిల్లలు రాష్ట్రంలో చదువులకు దూరమయ్యారు. ఇందులో కడప జిల్లా 16వ స్థానంలో ఉంది. దీంతో జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు బడిబయట పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలంటూ పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి కూటమి ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యంగా వందశాతం నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే..

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకు 3,58,218 మంది విద్యార్థులు బడిబయట ఉన్నారని.. పది ఉత్తీర్ణులైన తరువాత 1,55,427 మంది బడిబయట ఉన్నారని పాఠశాల విద్యశాఖ తేల్చిచెప్పింది. 1 నుంచి 10 వరకు ప్రస్తుతం బడి బయట ఉన్న పిల్లల సంఖ్య 2,02,791గా రాష్ట్ర విద్యాశాఖ తేల్చింది. ఇందులో కడప జిల్లాలో ఇంటర్మీడియట్ వరకు 15,807 మంది విద్యార్థులు బడికి పోవడం లేదని.. 10 ఉత్తీర్ణత అయిన తరువాత 9601 మంది బడి బయట ఉన్నారని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇదే విధంగా 1 నుంచి 10 వరకు 6201 బడిబయట ఉన్న పిల్లల సంఖ్యగా రాష్ట్రవిద్యాశాఖ తాజా లెక్కల ద్వారా తేల్చి చెప్పింది. గతంలో కొన్ని మండలాల్లో అసలు బడి బయట పిల్లలు లేరని ప్రకటించుకోవడం జరిగింది. పూర్వవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ బడిబయట పిల్లలు లేని సమాజాన్ని నిర్మిస్తామని లేదంటే రాజీనామా చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రవిద్యాశాఖ జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇస్తూ బడిబయట పిల్లలు ఎవరు లేకుండా చేసేందుకు వంద శాతం నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచనలు చేసింది. ఇందుకు సంబంధించి లక్ష్యాలు కూడా నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి



బడిబయట పిల్లలను పాఠశాల్లో చేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం వసతిగృహాలు, పునరావాస కేంద్రాలను బలోపేతం చేయాలి. సమస్య ఎక్కువగా ఉన్న చోట రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. బాల కార్మికులను పనిచేయించుకుంటున్న చిన్న చిన్న వ్యాపార కేంద్రాలు, వివిధ రంగాలపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే సౌకర్యాలను వర్తింపజేస్తున్నట్లు చట్టం తీసుకురావాలి. వంద శాతం నమోదు చేయాలే తప్ప కాకి లెక్కలకు స్వస్తి పలకాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

లక్ష్యాలు ఇవే..

● బడబయట ఉండి చదువుకునేందుకు అర్హత ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి వంద శాతం నమోదు చేయాలి.
● 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల పిల్లలు పాఠశాలకు దూరంగా ఉండకుండా చూడాలి.
● డ్రాపవుట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలకు తీసుకురావడం, సమగ్ర శిక్ష జిల్లా విద్యాశాఖాధికారులు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లు డ్రాపవుట్స్ పిల్లలను.. బడి బయట పిల్లలను రెగ్యులర్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేందుకు కేఎల్ఎస్‌టీవో, ఎంఈవో, సీఆర్పీల ద్వారా నమోదు చేయించాలి.
● సీఆర్పీలు, హెచ్‌ఎంలు, గ్రామ విద్యాసంక్షేమ సహాయకులు నిర్దేశించిన ప్రొఫార్మలో నమోదు లేఖను ప్రతి వారం తప్పనిసరిగా రాష్ట్ర ఎస్ఎస్ సమగ్రశిక్ష కార్యాలయానికి నివేదికలు పంపించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వంద శాతం బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో అధికారులు, సిబ్బంది దీనిపై ఎంత మేర లక్ష్యాలు సాధించగలరో చూడాల్సి ఉంది.

భారీ స్కోర్ల దిశగా అనంతపురం, గుంటూరు జట్లు

కడప స్పోర్ట్స్ నవంబర్,10 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం కడపలో వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం, క్రిష్ణా జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు చేసింది. ఇందులో ఆర్. ఆదినారాయణరెడ్డి 181 పరుగులు (124బంతుల్లో) సాధించడం విశేషం. అలాగే కేఎస్ఆర్ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన గుంటూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 334 పరుగుల భారీ స్కోర్ సాధించిం ది. ఇందులో కౌశిక్ 92, రామ్‌చరణ్ 81, అభినవ్ డేవిడ్ 74 పరుగులు చేశారు.

రాష్ట్రస్థాయి హాకీ విజేతలు కడప, విశాఖ

● జాతీయ స్థాయికి రెండు జట్లు ఎంపిక ● వచ్చే నెల ఎనిమిది నుంచి మధ్యప్రదేశ్‌లో పోటీలు


జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ పోరులో బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో ద్వితీయ స్థానం కడప, తృతీయ స్థానం చిత్తూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదిలావుంటే, రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయికి అర్హత సాధించారు. రాష్ట్రం తరపున జాతీయ పోటీల కోసం బాల, బాలికల విభాగంలో రెండు జట్లను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరు డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మాంటిస్సోరి గ్రామంలో జరగనున్న జాతీయ పోటీల్లో తలపడనున్నారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలు


బ్రహ్మంగారి దేవస్థానం, కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలను ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. పూర్వపు మఠాధిపతుల ఆదేశానుసారం కార్తీక శుద్ధ ద్వాదశి రోజు స్వామివారి జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13న బుధవారం రాత్రి 7గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు రూ.2116 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కల్యాణ సమయంలో చదివింపులు చేసిన వారికి తలంబ్రాలు, అక్షింతలు అందిస్తారని ఆలయ మేనేజరు ఈశ్వరాచారి తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



సికెదిన్నె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బుగ్గవంక డ్యాంలో పడి తాటిమాకుల అంకయ్య (54) మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు... మండలంలోని ఇప్పెంట యానాది కాలనీకి చెందిన అంకయ్య బుగ్గవంక డ్యాంలో చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడి మృతి చెందాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు డ్యాం వద్ద ఆదివారం పరిశీలించగా అంకయ్య శవం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈత కోసం నదిలోకి దిగి...



చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలసి సరదాగా గడిపేందుకు వెళ్లి.. ఈత కోసం పెన్నానదిలోకి దిగిన ఓవ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన బిల్లిపాటి బాబు (38) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం గండి వాటర్‌వర్క్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఒడ్డుపై భార్య, కొడుకును కూర్చోబెట్టి బావమరదులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. బావమరదులు సమీపంలోని వ్యక్తులతో కలిసి వెతకగా.. రెండు గంటల తర్వాత మృతదేహం బయటపడింది. చెన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ..


చాపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో మొగిలి లక్ష్మీదేవి (25) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మీదేవి తన ఇంటిలో ఉన్న విద్యుత్తు మోటారును ఆన్‌చేసి నీటిని ఇంటిలో పట్టుకుంటుండగా వైరు డ్యామేజీ అయినచోట ఆమె కాళ్లకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురైంది. వెంటనే అత్త రామలక్షుమ్మ, బావ రామచంద్రయ్య లక్ష్మీదేవిని కాపాడేందుకు ప్రయత్నించగా వారికి కూడా కరెంటుషాక్ తగిలడంతో కేకలు వేశారు. దీంతో ఇంటిలోనే ఉన్న లక్ష్మీదేవి భర్త రామ్మోహన్ విద్యుత్తు బోర్డులో స్విచ్ ఆఫ్ చేశారు. అయితే అప్పటికే లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అత్త, బావలు ప్రమాదం నుంచి బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడా పోటీలు


బాలికల విభాగంలో విజేతగా నిలిచిన కర్నూలు జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

● విజేతలుగా నిలిచిన కర్నూలు, నెల్లూరు జట్లు

కమలాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీకాలేజీ ఆవరణలో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్ 14 రగ్బీ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 13 జట్లు పాలొనగా.. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో బాలికల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జట్టుకు రెండో స్థానం దక్కింది. అదే విధంగా బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు స్కూలు గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీ తిరుపాల్‌రెడ్డి, సూర్య ట్రాన్స్‌పోర్టు అధినేత ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివాదాస్పదంగా మట్టి వ్యవహారం

● రాయల్టీ అధికారులకు ఫిర్యాదు

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలో మట్టి తోలుకునే వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. మట్టిని ఎక్కడపడితే అక్కడ తోలుకుంటున్నారు. ఇప్పటికే గుట్టలు గుల్ల అయిపోయాయి. ఇటీవల లీజును టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి తెచ్చుకున్నారు. రెండు రోజుల క్రితం మట్టితోలుకునేందుకు వెళ్లగా టీడీపీకి చెందిన మరోవర్గం వారు అభ్యంతరం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా లీజు పత్రాలు ఉన్నాయని చూపడంతో సమస్య సద్దుమణిగింది. కాగా, పాములూరు రోడ్డులోని కొండల వద్ద మట్టి తోలేందుకు టీడీపీలోని ఒక వర్గం వెళ్లగా లీజు తీసుకున్న జయచంద్రారెడ్డి తదితరులు అడ్డుకొని రాయల్టీ అధికారులకు ఫిర్యాదు చేశా రు. పులివెందుల జోన్ రాయల్టీ అధికారి సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రూ.10వేలు జరిమానా వేసి పంపించామని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రంగారావులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఎక్కడపడితే అక్కడ రాయల్టీలు లేకుండా మట్టిని తోలుకుంటుండగా సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో రాయల్టీతో లీజు ఉన్న ప్రాంతంలోనే మట్టిని తోలాలని.. ఇతర ప్రాంతాలలో తరలిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది ఆచరణలో ఎంతమాత్రం జరుగుతుందో వేచి చూడాల్సిందే.


మట్టి తోలుతున్న ప్రాంతానికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి తదితరులు

ఆత్మకూరులో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్


క్రీడాజ్యోతిని వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులో క్రీడా సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆదివారం 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలను జ్యోతిని వెలిగించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 39 టీమ్‌లకు సంబంధించిన 546 మంది క్రీడాకారులు, 72 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ విద్యార్థులంతా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించి జాతీయస్థాయిలో రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఆత్మకూరులో జరిగే నెట్‌బాల్ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు, మన రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపికయ్యే బృందానికి జెర్సీలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముద్దల పండుగ

సిద్దవటం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గాంధీవీధిలో గురువారం గంగమ్మ ముద్దల పండుగ నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం సహస్ర నామార్చన, కుంకుమార్చన చేశారు. అనంతరం బోనాలు సమర్పించారు.

సుగవాసితో ఆకేపాటి సోదరుల భేటీ!

రాజంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చిన్నాన్న గోపాల్‌రెడ్డి కుమారులు, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి అలియాస్ మురళీరెడ్డి, ఆయన సోదరుడు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, మండలాధ్యక్షుడు వెంకట నారాయణ ఆదివారం భేటీ అయ్యారు. రాజంపేట మండల పరిషత్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వారి వర్గీయులు సుగవాసిని ఘనంగా సత్కరించారు. దీంతో ఈ విషయం రాజంపేట నియోజకవర్గంలో పెద్ద చర్చనీయాంశమైంది. ఆకేపాటి సోదరులు త్వరలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వీరితోపాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.


సుగవాసి బాలసుబ్రమణ్యంకు స్వాగతం పలుకుతున్న ఆకేపాటి సోదరులు శ్రీనివాసులరెడ్డి, రంగారెడ్డి

మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి

రాజంపేట మండల సర్వతోముఖాభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేట మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దివంగత నాయకుడు ఆకేపాటి గోపాల్‌రెడ్డి, తమ తండ్రి పాలకొండ్రాయుడు ప్రాణ స్నేహితులని, ఆయన కుమారుల ఆహ్వానం మేరకు రాజంపేట మండల సమావేశానికి హాజరయ్యానన్నారు. ఇక్కడి సమస్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వరప్రసాద్, సూపరింటెంటెంట్ బాల మునుస్వామితో పాటు మండల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద 50 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుగవాసికి ఘన సత్కారం

మండల సమావేశానికి సుగవాసి బాలసుబ్రమణ్యంను ఘనంగా స్వాగతించారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు గౌస్, మండల టీడీపీ అధ్యక్షుడు శివనారాయణ తదితరులు గజమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మాజీ ఎంపీపీ గుడారు సుబ్రమణ్యంనాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు రామనరసింహులు, సీనియర్ టీడీపీ నేతలు బీఎల్ ప్రసాద్, తెలుగుయువత నాయకులు దగ్గుపాటి రవికుమార్, మండల టీడీపీ నాయకుడు మేకా నరసింహులు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలు లక్ష్యం!

నందలూరు: నియోజకవర్గంలో లక్ష మందిని టీడీపీ సభ్యులుగా చేర్చి నూతన శకానికి నాంది పలకాలని, అందులో నందలూరు మండలం ముందుండాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జిల్లా లీగల్‌సెల్ నాయకుడు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీలు కడవకూటి సాయిబాబా, పల్లె సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలకు ప్రాధాన్యం దారుణం'

రాజంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి చెందిన ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి రంగారెడ్డిలను రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం కలవడాన్ని పలువురు టీడీపీ నేతలు విమర్శించారు. టీడీపీ ఓటమికి కారకులైన ఆకేపాటి సోదరులను ఆయన కలవడం టీడీపీ కార్యకర్తల మనోభావాలను గాయపరిచిందన్నారు. ఆదివారం రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, ప్రధాన కార్యదర్శి అబూబకర్, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అజయ్, జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు శివకుమార్‌చౌదరి, సీనియర్ టీడీపీ నాయకులు మేడిపండు రవి, సుబ్బరాయుడు మాట్లాడుతూ బాలసుబ్రమణ్యం టీడీపీ కార్యకర్తలను పలుకరించకుండా, వైసీపీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఈ చర్యతో టీడీపీ కార్యకర్తలకు భవిష్యత్ ఉండదన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్న ముక్కపల్లె పంచాయతీలో సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

- పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నరెడ్డెన్న


పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చిన్నరెడ్డెన్న

రాయచోటి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘంలో సభ్యత్వాల నమోదును ముమ్మరం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్న రెడ్డెన్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్నమయ్య జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పెన్షనర్ సంఘంలో సభ్యత్వం పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకట్రమణ మాట్లాడుతూ క్వాంటం పెన్షన్ 11 ఏళ్ల ఐదు నెలలకే కుదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. . సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డికుమార్, ఉపాధ్యక్షుడు చెంగల్ రెడ్డి, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, ఈశ్వరయ్య సూచనలిచ్చారు.

'దార్శనికుడు టిప్పు సుల్తాన్'


వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

రాయచోటి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద శక్తుల రాజ్య విస్తరణ కాంక్షకు వ్యతిరేకంగా స్వదేశీయులను ఏకం కమ్మని పిలుపునిచ్చిన దార్శనికుడు అని టిప్పు సుల్తాన్ అని పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వలి అన్నారు. టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో ఉన్న టిప్పు సుల్తాన్ సర్కిల్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. మక్తబే ఇందాదుల్ ఖురాన్ మద్రాసా నిర్వాహకులు హఫీజ్ పర్హాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అతావుల్లా, జాఫర్‌వలిఖాన్, ఎజాస్, ఢిల్లీ, ఫిరోజ్‌ఖాన్, రెహమాన్ ఖాన్, పఠాన్, సహారా సొసైటీ జిలీనాబాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కా రూపానందరెడ్డికి సన్మానం


ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న లేబాక శ్రీనివాసులరెడ్డి

పెనగలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎంపికైన ముక్కా రూపానందరెడ్డిని ఆదివారం పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి తదితరులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్.శ్రీనివాసులరెడ్డి, మండల బీసీ సంఘం అధ్యక్షుడు కోడూరు వెంకటయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవికుమార్, సింగనమల సర్పంచ్ ఎర్రి శివ, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మన్నూరు సత్యనారాయణనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

పుల్లంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు అరవింద్‌కిషోర్ సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్దనిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో కూడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితా, ఫారం-6, 7 లతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు.

104 ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తయినా, ఇప్పటికీ ఆ అంశంపై స్పందించలేదన్నారు. అరకొర వేతనాలు సకాలంలో చెల్లించకపోగా, జీవో నెంబర్ 7 ప్రకారం కనీస వేతనం అమలు చేయకపోవడం మోసం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజు, విశ్వనాథరెడ్డి, నాగార్జున, వినయ్, వంశీ, విశ్వనాథ్, రాము, సోము, శ్రీనివాసులు, రాజశేఖర్, మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఒంటిమిట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని కొత్తమాధవ రానికి చెందిన బొడిచెర్ల శ్రీనివాసులు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో కలిసి 60 వేల రూపాయల చెక్కును అం దజేశారు. చేనేత కార్మికుల జ్ఞాపకార్థం తమ గ్రామం తరఫున వరదబాధితులకు ఆర్థికసాయం చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతి ఇంటికి కొళాయి మంజూరు

సిద్దవటం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి ఎస్టీ కాలనీలో ఆదివారం ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ చేయాలి

రాజంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాల విద్యార్థి మోహిత్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలని పీడీ ఎస్‌యూ నేత నందకుమార్ డిమాండ్ చేశారు. రాజంపేటలోని బీసీ బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవీపల్లె మండల గురుకులంలో జరిగిన ఈ సంఘటనలో ప్రిన్సిపాల్, హాస్టల్‌వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేసి సీబీఐ విచారణ చేయించాలని కోరారు. .

మంత్రి సవితతో కేకే చౌదరి భేటీ

చిట్వేలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ, ఈబీసీ సంక్షేమ, చేనేత, జౌళీశాఖ మంత్రి ఎస్.సవితను ఏపీ ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి ఆదివారం తాడేపల్లెలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై చర్చించారు.

'ప్రజల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలి'


సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులతో ప్రసాద్‌బాబు

రాయచోటి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామచంద్రుని ఆశీస్సులతో ప్రజల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కోరుకున్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం ఎగువ ఇందుకూరుపల్లెలో సీతారామ కల్యాణోత్సవానికి ఆయన హాజరయ్యారు. గ్రామ టీడీపీ నాయకులు సుబ్బయ్య నాయుడు, శ్రీనివాసులు నాయుడు, ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

గాలివీడు, నవంబరు10(ఆంధ్రజ్యోతి):అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు సేవాభావం సంస్థ అధ్యక్షుడు ఆర్యశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పెద్ద చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో నవంబరు 8వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తున్నామన్నారు. చుట్టుపక్కల ఉన్న అయ్యప్పస్వామి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వినాయక్‌కు డాక్టరేట్

సుండుపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుంపాడు గ్రామపంచాయతీ ఆరోగ్యపురానికి చెందిన మూడే వినాయక్‌కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ట్రాక్టర్ మౌంటెడ్ రౌండ్ బేసిన్‌మేకర్ కమ్ ఫర్టిలైజర్ అప్లికేటర్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ పురస్కారం ప్రకటించింది. ఈయన ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఓబులవారిపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడినట్లు 108 సిబ్బంది తెలిపారు. జీవీ పురం అరుంధతివాడకు చెందిన దినేష్ అనే యువకుడు ఓబులవారిపల్లె నుంచి ఇంటికి వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు దెబ్బ తగిలి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

మంచుకొండల పంట.. మదనపల్లె ఇంట..

సాధారణంగా కుంకుమ పువ్వు అనగానే ప్రతి ఒక్కరికీ కశ్మీర్ గుర్తొస్తుంది. ఇంచుమించు అలాంటి వాతావరణమే ఉన్న మదనపల్లెలో ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనే ఓ అగ్రికల్చర్ విద్యార్థినికి వచ్చింది. ఇక వెనక్కు తిరిగి చూడకుండా వినూత్న సాగుకు సిద్ధమైంది. పంటను కంటికి రెప్పలా చూసుకుంటూ మూడేళ్లుగా మంచి ఫలితాలను సాధిస్తోంది. తెలుగురాష్ట్రాల్లో చాలా అరుదుగా సాగయ్యే పంట మదనపల్లెలో అందుబాటులో ఉండడంతో పట్టణవాసులే కాకుండా జిల్లా వాసులు ఆ విద్యార్థినిని శభాష్ అని అభినందిస్తున్నారు.

- అగ్రికల్చర్ విద్యార్థిని శ్రీనిధి వినూత్న ఆలోచన
- మూడేళ్లుగా మంచి ఫలితాలు
- శభాష్ అంటున్న జిల్లావాసులు

మదనపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచుకొండల మధ్య చల్లటి ప్రదేశాలైన జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో మాత్రమే సాగయ్యే కుంకుమపువ్వు పంట ప్రస్తుతం మదనపల్లెలో సాగవుతోంది. పట్టణ శివారు ప్రాంతం చిప్పిలికి చెందిన పువ్వు శ్రీకాంత్‌రెడ్డి, పువ్వు భార్గవి దంపతుల కుమార్తె పి.శ్రీనిధి ఈ పంట సాగు చేస్తున్నారు. ఒకటి కాదు..రెండు కాదు..వరుసగా మూడేళ్లు పట్టువదలని విక్రమార్కునిలా పంట సాగు చేయడమే కాదు.. ఏటికేడు సాగులో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికతను అంది పుచ్చుకుంటూ ముందుకెళ్తున్నారు. అందరిలాగా ఫలితాల కోసం పాకులాడకుండా, లాభం కోసం ఎదురుచూడకుండా, పంట సాగునకు అనుకూలమైన ఇక్కడి వాతావరణంలో సాగు మరింత విస్తరించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒకటి రెండు చోట్ల అక్కడక్కడా సాగయ్యే కుంకుమ పువ్వు సాగును పదిమంది రైతులకు పరిచయం చేయడానికి పరితపిస్తున్నారు. ఇందుకోసం కుంకుమ పువ్వు కంటే విత్తనం ఉత్పత్తికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కేవలం మూడు నెలల వ్యవధితో చేతికొచ్చే ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది.



ట్రేలో సాగుచేస్తున్న కుంకుమ పంట



కుంకుమ రేఖలు



వేరు చేసిన కుంకుమ రేణువులు

స్నేహితుడు.. తల్లిదండ్రుల సహకారం

తనతో పాటు బెంగళూరు యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన తన స్నేహితుడు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనిధి తల్లిదండ్రుల సహకారంతో మూడేళ్లుగా నిరాటంకంగా పంట సాగు చేస్తున్నారు. మొదటగా 2022 ఆగస్టులో విత్తనాన్ని జమ్మూ-కశ్మీర్ నుంచి తెప్పించారు. పంట సాగుకోసం మొదట రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. పంటసాగులో జమ్ము-కశ్మీర్, హర్యానా యూనివర్సిటీ ప్రొఫెసర్ల నుంచి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తీసుకుంటూ మొదలు పెట్టగా, ప్రస్తుతం శ్రీనిధి అన్నీ తానే స్వయంగా చూసుకుంటున్నారు. ఏటా ఆగస్టులో నాటే ఈ పంట కేవలం మూడు నెలల వ్యవధిలోనే అంటే నవంబరులో పూర్తవుతుంది. అంచెలంచెలుగా వికసించే పుష్పాలను ఎప్పటికప్పుడు కోస్తూ, రేఖలు, అందులోని పుష్పరేణువులను వేరు చేస్తారు. ఇందులో రేణువుల నుంచి కుంకుమ పువ్వు తీస్తుండగా, రేఖలను కూడా ఇతర అవసరాలకు మార్కెట్ చేస్తున్నారు.

విద్యాభ్యాసం

బెంగళూరు యూనివర్సిటీలో సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేటర్ (అగ్రికల్చర్) బీఎస్సీ పూర్తి చేసిన శ్రీనిధి ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి తర్వాత ఎస్వీ యూనివర్సిటీలో అదే విభాగంలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. తర్వాత అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ చేయాలని మొదట అనుకున్నా జీవితంలో ఏదో ఒకటి సాధించాలని సంకల్పించారు. తాను ఎంచుకునే ప్రాజెక్ట్‌ను రొటీన్‌కు భిన్నంగా ఉండాలని ప్రత్యేకంగా ఆలోచించారు.

సాగు విధానం

240 చ.అ.విస్తీర్ణం గల గదిలో 340 ట్రేలు ఏర్పాటు చేయగా, ఒక్కో ట్రేలో విత్తన పరిమాణాన్ని బట్టి 100 నుంచి 130 విత్తనాలు అమరుస్తున్నారు. 2022 నుంచి 2024 వరకూ క్రమంగా 150 గ్రాములు, 200 గ్రాములు, 400 గ్రాముల కుంకుమ పువ్వును ఉత్పత్తి చేశారు. రోజువారీ కోసిన పుష్పాల నుంచి రేఖలు, స్టిగ్మాను వేరు చేసి కుంకుమ పువ్వును పక్కకు తీసి ఆరబెడతారు. సాగు చేసిన ప్రతీ విత్తనం ఫెయిల్ కాకుండా పువ్వు పూస్తే పంట దిగుబడి పెరుగుతుంది. అలాగే విత్తనం పరిపుష్టిగా ఉంటే రెండు పువ్వులు కూడా పూస్తుంటాయి. కుంకుమ పువ్వు మార్కెట్‌లో గ్రాము ధర రూ.500 నుంచి రూ.700 పలుకుతోంది. మిగిలిన పసుపు స్టిగ్స్, రేఖలను ఇతర అవసరాలైన స్వీట్స్, కాస్మెటిక్‌లలో ఉపయోగిస్తారు. ఇటీవల వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో జమ్మూ-కశ్మీర్‌లోనూ ఇండోర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. విత్తనాన్ని మరింత ఉత్పత్తి చేసే క్రమంలో కృత్రిమ వాతావరణంలో కాకుండా సాధారణ వాతావరణంలో మంచి పోషకాలు ఇచ్చి విత్తనం పరిమాణం పెద్దదిగా ఉండేలా పరిశోధనలు చేస్తున్నారు.



వికసించిన పుష్పం

ప్రత్యేకగది.. కోల్డ్ స్టోరేజ్

జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల సెల్సియస్ నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌లో ఉంటాయి. అలాంటి వాతావరణంలో మాత్రమే కుంకుమ పువ్వు సాగవుతుంది. ఇలాంటి వాతావరణాన్నే ఇక్కడ పంట సాగునకు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో తన నివాసంలోని ప్రత్యేక గదిలో చిల్లింగ్ కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన ఆ గదిలో వాతావరణాన్ని ఎప్పటికప్పుడు పరికరాలతో పరిశీలిస్తూ, ఉష్ణోగ్రతలో ఏమాత్రం తేడా లేకుండా చూస్తున్నారు. హైజినిక్ కండీషన్‌లో పాలీయూరేటెడ్ ఫైబర్, థర్మాకోల్ ఇన్సులేషన్‌తో ఇండోర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. గాలిలో తేమ ఆధారంగా ఆర్గానిక్ పద్ధతిని అవలంబిస్తున్నారు. విత్తనం ఏడు గ్రాములుంటే ఒక పువ్వు, పది గ్రాములు ఆపై ఉంటే రెండు పూలు పంట దిగుబడి వస్తున్నట్లు నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఇక్కడెందుకు సాగు చేయకూడదు

- పి.శ్రీనిధి, నిర్వాహకురాలు, మదనపల్లె



కశ్మీర్‌లోనే పండించే పంట ఇక్కడ ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచన నాకు వచ్చింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకుంటూ మూడేళ్లుగా సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది వచ్చే ఇబ్బందులు, సమస్యలను అధిగమిస్తూ, పంట సాగులో మెలకువలు పాటిస్తూ పురోగతి సాధిస్తున్నా. ఇతర రాష్ట్రాల్లోనూ అతి తక్కువగా సాగవుతున్న పంట ఇది. ఇందులో లాభం కంటే వాటి విత్తనాలు ఉత్పత్తి చేయాలన్నదే నా ప్రధాన ఉద్దేశ్యం.

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని కాపాడిన సీఐ

బి.కొత్తకోట, నవంబరు 10: క్షణికావేశంలో తనువు చాలించబోయిన యువకుడి ప్రాణాలు బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి కాపాడారు. పోలీసుల కథనం మేరకు... గొల్లపల్లె పంచాయతీ గుడిసివారిపల్లె వాసి జీవన్‌రెడ్డి చదువు పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంటున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన ఓ కంపెనీ ఉద్యోగి కడప వాసి రంజిత్‌రాయల్ మాటలు నమ్మి రూ.2లక్షలు డబ్బు చెల్లించాడు. అయితే అతను నమ్మించి మోసం చేశాడని గ్రహించి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం బాగా పొద్దుపోయాక తన తల్లికి ఫోన్ చేసి తాను మోసపోయానని, ఇక జీవించాలను కోలేదని, ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. దీంతో తల్లి తనకు అందుబాటులో ఉన్న బంధువులందరికీ చెప్పినా ఫలితం లేకపోయింది. చివరికి సీఐ రాజారెడ్డికి సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన సీఐ లోకేషన్‌ను కనిపెట్టాడు. వెంటనే సిబ్బందితో పాటు వెళ్లి జీవన్‌రెడ్డిని పట్టుకున్నారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు. తప్పులు చేయడమే కాకుండా కుటుంబీకులను బాధితులను చేయడం, పైగా ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తన బిడ్డ ప్రాణాలు కాపాడినందుకు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను సత్కరించారు.



సీఐ రాజారెడ్డిని సత్కరిస్తున్న జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు







శివపూజకోసం..


కార్తీకమాసం కావడంతో శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. కొండకోనల్లో కొలువైన శివుని దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివెళుతున్నారు. కార్తీక వనభోజనాలూ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీనికి తగినట్టు జిల్లాలోని పెండ్లిమర్రి, పులివెందుల, ఖాజీపేట మండలాల్లో పూలతోటల్లో రైతులు బిజీగా ఉన్నారు. కూలీలను పెట్టి పూలను కోసి అమ్మకాలకు తరలిస్తున్నారు. రోడ్డుపక్కన కళకళలాడుతున్న సువాసనల విరులు ఆ మార్గంలో వెళ్లేవారికి కనువిందు చేస్తున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప









కోన సమీపంలోని లోయ దృశ్యం

కమనీయం.. అగస్త్యేశ్వర క్షేత్రం

- భక్తులకు కొంగు బంగారం
- కొండకోనల నడుమ వెలసిన శైవక్షేత్రం
- మహర్షుల పాద ధూళితో పునీతం

మైలవరం, నవంబరు 10: సుందరమైన కొండ కోనలు, వాగు వంకలు, పచ్చిక బయళ్ల ప్రకృతి సిద్ధమైన గుహలు ఇలా కమనీయ, రమణీయ దృశ్యాలతో అగస్త్యేశ్వర క్షేత్రం అలరారుతోంది. కాగా సకల వ్యాధి నివారణ క్షేత్రంగా శ్రీ అగస్త్య మహాముని కఠోర దీక్ష తపో భూమి అయిన ఈ క్షేత్రం భక్తుల పెన్నిధిగా ఉంటోంది. ముఖ్యంగా కార్తీక మాసం, శివరాత్రి సమయాల్లో భక్తుల సందడితో ఈ క్షేత్రం కళకళలాడుతోంది. రాయలసీమలోని దండ కారణ్యంలో ఎందరో మహానుభావుల, మహర్షుల పాద ధూళితో పునీతమైన ఈ అగస్త్యేశ్వర క్షేత్రం అత్రిముని కోనగా కూడా విరాజిల్లుతోంది.


దివ్య కొలను.. ఔషధ జలం...

అనేక రాజ్యాల రాజకీయ చతురతను, వీర విహారాన్ని గుర్తుకు తెస్తూ సాక్షి భూతంగా నిలిచిన గండికోటకు అతి సమీపంలో లోయ, అవతలి వైపు కొండలో వెలసిన అగస్త్యేశ్వర క్షేత్రంలో స్వయం సిద్ధంగా పుట్టిన పిల్ల కాలువలతో, వన మూలికలతో దివ్య ఔషధమైన జలాన్ని నింపుకున్న కొలను ఇక్కడ ఉంది. ఈ కొలనులో అగస్త్య మహాముని ప్రతి రోజు స్నానం ఆచరించి జప తపాలు చేసినట్లు స్థల పురాణం వల్ల తెలుస్తోంది. ఎందరో అనారోగ్య పీడితులు ఈ కొలనులో స్నానం ఆచరించి స్వస్థత పొందుతున్నట్లు ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటున్నారు.

మాతృత్వాన్ని ప్రసాదించే ఆదిశేషుడు

దుర్గా సుబ్రమణ్యేశ్వర వర ప్రసాదంగా, అగస్త్య మహాముని తపో ఫలితంగా వెలసి కోరిన వరాలు ఇస్తూ సంతానం లేని వారికి మాతృత్వాన్ని కలిగిస్తున్న ఆదిశేషుని నివాసం (బ్రహ్మాండమైన పుట్ట) మహిళల కలలను సాకారం చేస్తున్నట్లు భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పుట్టకు 40 రోజుల పాటు ప్రదర్శనలు చేసి సంతానం లేనివారు ఎందరో మాతృ సౌభాగ్యం పొందుతున్నట్లు ప్రజల విశ్వాసం.

జమ్మలమడుగు నుంచి అగస్త్యేశ్వర కోనకు ఆర్టీసీ వారు బస్సుసౌకర్యం కల్పించడంతో రోజు రోజుకు సందర్శకుల రద్దీ పెరుగుతోంది. ఇక్కడ భక్తాదుల నివాసానికి వసతి, భోజన సదుపాయాలతో ఈ క్షేత్రం నిత్య నూతనంగా విరాజిల్లుతోంది. కార్తీక మాసం, దత్త జయంతి, నవరాత్రి ఉత్సవాలు, అలాగే ధనుర్మాసంలో విశేష పూజలు ఘనంగా జరుగుతాయి. ముఖ్యంగా ఈ క్షేత్రం కార్తీక మాసం, శివరాత్రి పర్వదినాల సందర్భంగా భక్తజన సందోహంతో కోలాహలంగా తిరుణాల వాతావరణంలో ఉంటుంది.



ఆలయ ఆవరణంలోని దివ్య కొలను

క్షేత్ర మహిమ

మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో కొండల నడుమ ఈ అగస్త్యేశ్వర క్షేత్రం ఉంది. త్రేతా యుగంలో అగస్త్య మహాముని దేశ సంచారంలో భాగంగా దక్షిణదిశగా వెళ్తూ మార్గం మధ్యలో అనేక చోట్ల శివలింగాల ప్రతిష్ఠలు చేసి తపస్సు కొనసాగిస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో దండ కారణ్యమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి అగస్త్య కోనలో అడుగుపెట్టారు. ఇక్కడ మనో సిద్ధి కోసం ధర్మపత్ని లోపముద్రతో కూడి పరమేశ్వరానుగ్రహానికై దుర్గా సుబ్రమణ్యేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠ గావించి ఘోర తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.



ఆలయంలోని శివలింగం

రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

- ఒకరి మృతి ● మరొకరికి తీవ్రగాయాలు ● ఇరువురికి స్వల్పగాయాలు

సిద్దవటం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చిరంజీవి వివరాల మేరకు.. మండలంలోని వడ్డిపల్లె గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు రెండు ద్విచక్ర వాహనాల్లో ఇద్దరు చొప్పున ఆదివారం కడపకు వెళుతున్నారు. కడప - చెన్నై రహదారిలోని భాకరాపేట మల్లిలేనిపట్నం మలుపు వద్దకు రాగానే కడప వైపు నుంచి రాజంపేటకు వేగంగా వెళుతున్న కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు ఢీకొన్న బైకులో కిరణ్‌కుమార్(17), శేషాద్రి(18)లకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక వస్తున్న మరో బైకులో ఉన్న వర్ధన్, బాలు అనే ఇరువురికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. నలుగురిని వైద్య చికిత్సల నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతిచెందినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేషాద్రిని మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిరణ్ (ఫైల్ ఫొటో)

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కార్యవర్గంతో ఆస్కార్‌రావు

కడప మారుతీనగర్, నవంబర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకులు మారుతున్నా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాలకుల తీరు కారణంగా రోజురోజుకూ ఉద్యోగులపై భారం ఎక్కువ అవుతోందన్నారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల ముఖ ఆధారిత విధానాన్ని అటెండెన్స్‌తో పాటు వాటి ఆధారంగా జీతభత్యాల నిర్ణయం, కోతలు విధించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంలపై ఇటు ఆరోగ్యశాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల పెత్తనం ఎక్కువ కావడం సరైందికాదన్నారు. ముఖ్యంగా వైద్య ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకపోగా పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తదనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.విన్సెంట్‌కుమార్, కార్యదర్శిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్ వరప్రసాద్, శివ, సంయుక్త కార్యదర్శులుగా విజయలక్ష్మి, లక్ష్మీదేవి, నాగేశ్వరి, రామసుబ్బారెడ్డి, ఏసుపాదం, సుధాకర్, అన్నపూర్ణ, నియమితులయ్యారు.

భారీ స్కోర్ల దిశగా అనంతపురం, గుంటూరు జట్లు

కడప స్పోర్ట్స్ నవంబర్,10 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం కడపలో వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. కేఓఆర్‌ఎం మైదానంలో అనంతపురం, క్రిష్ణా జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు చేసింది. ఇందులో ఆర్. ఆదినారాయణరెడ్డి 181 పరుగులు (124బంతుల్లో) సాధించడం విశేషం. అలాగే కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన గుంటూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 334 పరుగుల భారీ స్కోర్ సాధించిం ది. ఇందులో కౌశిక్ 92, రామ్‌చరణ్ 81, అభినవ్ డేవిడ్ 74 పరుగులు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



సికెదిన్నె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బుగ్గవంక డ్యాంలో పడి తాటిమాకుల అంకయ్య (54) మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు... మండలంలోని ఇప్పెంట యానాది కాలనీకి చెందిన అంకయ్య బుగ్గవంక డ్యాంలో చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడి మృతి చెందాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు డ్యాం వద్ద ఆదివారం పరిశీలించగా అంకయ్య శవం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈత కోసం నదిలోకి దిగిన వ్యక్తి...



చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలసి సరదాగా గడిపేందుకు వెళ్లి.. ఈత కోసం పెన్నానదిలోకి దిగిన ఓవ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన బిల్లిపాటి బాబు (38) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం గండి వాటర్‌వర్క్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఒడ్డుపై భార్య, కొడుకును కూర్చోబెట్టి బావమరదులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. బావమరదులు సమీపంలోని వ్యక్తులతో కలిసి వెతకగా.. రెండు గంటల తర్వాత మృతదేహం బయటపడింది. చెన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చాపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో మొగిలి లక్ష్మీదేవి (25) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మీదేవి తన ఇంటిలో ఉన్న విద్యుత్తు మోటారును ఆన్‌చేసి నీటిని ఇంటిలో పట్టుకుంటుండగా వైరు డ్యామేజీ అయినచోట ఆమె కాళ్లకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురైంది. వెంటనే అత్త రామలక్షుమ్మ, బావ రామచంద్రయ్య లక్ష్మీదేవిని కాపాడేందుకు ప్రయత్నించగా వారికి కూడా కరెంటుషాక్ తగిలడంతో కేకలు వేశారు. దీంతో ఇంటిలోనే ఉన్న లక్ష్మీదేవి భర్త రామ్మోహన్ విద్యుత్తు బోర్డులో స్విచ్ ఆఫ్ చేశారు. అయితే అప్పటికే లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అత్త, బావలు ప్రమాదం నుంచి బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బడికి దూరంగా...

● చదువుకు దూరమవుతున్న లక్షలాది మంది పిల్లలు
● జిల్లాలో బడిబయట పిల్లల సంఖ్య 15807 మంది
● చర్యలకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం
● అర్హత ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు పాఠశాల విద్యకు ఖర్చు చేస్తున్నా వాటి ఫలితాలు పూర్తిస్థాయిలో కనిపించడంలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువులకు దూరమవుతున్న పిల్లల పట్ల కనీస చర్యలు చేపట్టకపోవడం.. పాఠశాలల్లో లేని పిల్లలను కూడా ఉన్నట్లు గతంలో చూపించడం.. తదితర కారణాలతో ప్రస్తుతం లక్షలాది మంది పిల్లలు రాష్ట్రంలో చదువులకు దూరమయ్యారు. ఇందులో కడప జిల్లా 16వ స్థానంలో ఉంది. దీంతో జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు బడిబయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలంటూ పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి కూటమి ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యంగా వందశాతం నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే..

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకు 3,58,218 మంది విద్యార్థులు బడిబయట ఉన్నారని.. పది ఉత్తీర్ణులైన తరువాత 1,55,427 మంది బడిబయట ఉన్నారని పాఠశాల విద్యాశాఖ తేల్చిచెప్పింది. 1 నుంచి 10 వరకు ప్రస్తుతం బడి బయట ఉన్న పిల్లల సంఖ్య 2,02,791గా రాష్ట్ర విద్యాశాఖ తేల్చింది. ఇందులో కడప జిల్లాలో ఇంటర్మీడియట్ వరకు 15,807 మంది విద్యార్థులు బడికి పోవడం లేదని.. 10 ఉత్తీర్ణత అయిన తరువాత 9601 మంది బడి బయట ఉన్నారని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇదే విధంగా 1 నుంచి 10 వరకు 6201 బడిబయట ఉన్న పిల్లల సంఖ్యగా రాష్ట్రవిద్యాశాఖ తాజా లెక్కల ద్వారా తేల్చిచెప్పింది. గతంలో కొన్ని మండలాల్లో అసలు బడి బయట పిల్లలు లేరని ప్రకటించుకోవడం జరిగింది. పూర్వవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ బడిబయట పిల్లలు లేని సమాజాన్ని నిర్మిస్తామని లేదంటే రాజీనామా చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రవిద్యాశాఖ జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇస్తూ బడిబయట పిల్లలు ఎవరు లేకుండా చేసేందుకు వంద శాతం నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచనలు చేసింది. ఇందుకు సంబంధించి లక్ష్యాలు కూడా నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి



బడిబయట పిల్లలను పాఠశాల్లో చేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం వసతిగృహాలు, పునరావాస కేంద్రాలను బలోపేతం చేయాలి. సమస్య ఎక్కువగా ఉన్న చోట రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. బాల కార్మికులను పనిచేయించుకుంటున్న చిన్న చిన్న వ్యాపార కేంద్రాలు, వివిధ రంగాలపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే సౌకర్యాలను వర్తింపజేస్తున్నట్లు చట్టం తీసుకురావాలి. వంద శాతం నమోదు చేయాలే తప్ప కాకి లెక్కలకు స్వస్తి పలకాలి.

– సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

లక్ష్యాలు ఇవే..

● బడబయట ఉండి చదువుకునేందుకు అర్హత ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి వంద శాతం నమోదు చేయాలి.
● 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల పిల్లలు పాఠశాలకు దూరంగా ఉండకుండా చూడాలి.
● డ్రాపవుట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలకు తీసుకురావడం, సమగ్ర శిక్ష జిల్లా విద్యాశాఖాధికారులు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లు డ్రాపవుట్స్ పిల్లలను.. బడి బయట పిల్లలను రెగ్యులర్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేందుకు కేఎల్ఎస్‌టీవో, ఎంఈవో, సీఆర్పీల ద్వారా నమోదు చేయించాలి.
● సీఆర్పీలు, హెచ్‌ఎంలు, గ్రామ విద్యాసంక్షేమ సహాయకులు నిర్దేశించిన ప్రొఫార్మలో నమోదు లేఖను ప్రతి వారం తప్పనిసరిగా రాష్ట్ర ఎస్ఎస్ సమగ్రశిక్ష కార్యాలయానికి నివేదికలు పంపించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వంద శాతం బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో అధికారులు, సిబ్బంది దీనిపై ఎంత మేర లక్ష్యాలు సాధించగలరో చూడాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి హాకీ విజేతలు కడప, విశాఖ

● జాతీయ స్థాయికి రెండు జట్లు ఎంపిక ● వచ్చే నెల ఎనిమిది నుంచి మధ్యప్రదేశ్‌లో పోటీలు



జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ పోరులో బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో ద్వితీయ స్థానం కడప, తృతీయ స్థానం చిత్తూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, నక్కపల్లి బీఏస్ హాకీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదిలావుంటే, రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయికి అర్హత సాధించారు. రాష్ట్రం తరఫున జాతీయ పోటీల కోసం బాల, బాలికల విభాగంలో రెండు జట్లను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరు డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మాంటిస్సోరి గ్రామంలో జరగనున్న జాతీయ పోటీల్లో తలపడనున్నారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడా పోటీలు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన కర్నూలు జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

● విజేతలుగా నిలిచిన కర్నూలు, నెల్లూరు జట్లు

కమలాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీకాలేజీ ఆవరణలో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్ 14 రగ్బీ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 13 జట్లు పాల్గొనగా.. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో బాలికల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జట్టుకు రెండో స్థానం దక్కింది. అదే విధంగా బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు స్కూలు గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీ తిరుపాల్‌రెడ్డి, సూర్య ట్రాన్స్‌పోర్టు అధినేత ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలు



బ్రహ్మంగారి దేవస్థానం, కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలను ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. పూర్వపు మఠాధిపతుల ఆదేశానుసారం కార్తీక శుద్ధ ద్వాదశి రోజు స్వామివారి జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13న బుధవారం రాత్రి 7గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు రూ.2116 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కల్యాణ సమయంలో చదివింపులు చేసిన వారికి తలంబ్రాలు, అక్షింతలు అందిస్తారని ఆలయ మేనేజరు ఈశ్వరాచారి తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తయినా, ఇప్పటికీ ఆ అంశంపై స్పందించలేదన్నారు. అరకొర వేతనాలు సకాలంలో చెల్లించకపోగా, జీవో నెంబర్ 7 ప్రకారం కనీస వేతనం అమలు చేయకపోవడం మోసం చేయడమే నన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజు, విశ్వనాథరెడ్డి, నాగార్జున, వినయ్, వంశీ, విశ్వనాథ్, రాము, సోము, శ్రీనివాసులు, రాజశేఖర్, మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఒంటిమిట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని కొత్తమాధవరానికి చెందిన బొడిచెర్ల శ్రీనివాసులు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో కలిసి 60 వేల రూపాయల చెక్కును అం దజేశారు. చేనేత కార్మికుల జ్ఞాప కార్థం తమ గ్రామం తరఫున వరదబాధితులకు ఆర్థికసాయం చేసి నట్లు ఆయన తెలిపారు.

వివాదాస్పదంగా మట్టి వ్యవహారం

● రాయల్టీ అధికారులకు ఫిర్యాదు

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలో మట్టి తోలుకునే వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. మట్టిని ఎక్కడపడితే అక్కడ తోలుకుంటున్నారు. ఇప్పటికే గుట్టలు గుల్ల అయిపోయాయి. ఇటీవల లీజును టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి తెచ్చుకున్నారు. రెండు రోజుల క్రితం మట్టితోలుకునేందుకు వెళ్లగా టీడీపీకి చెందిన మరోవర్గం వారు అభ్యంతరం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా లీజు పత్రాలు ఉన్నాయని చూపడంతో సమస్య సర్దుమణిగింది. కాగా, పాములూరు రోడ్డులోని కొండల వద్ద మట్టి తోలేందుకు టీడీపీలోని ఒక వర్గం వెళ్లగా లీజు తీసుకున్న జయచంద్రారెడ్డి తదితరులు అడ్డుకొని రాయల్టీ అధికారులకు ఫిర్యాదు చేశా రు. పులివెందుల జోన్ రాయల్టీ అధికారి సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రూ.10వేలు జరిమానా వేసి పంపించామని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రంగారావులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఎక్కడపడితే అక్కడ రాయల్టీలు లేకుండా మట్టిని తోలుకుంటుండగా సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో రాయల్టీతో లీజు ఉన్న ప్రాంతంలోనే మట్టిని తోలాలని.. ఇతర ప్రాంతాలలో తరలిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది ఆచరణలో ఎంతమాత్రం జరుగుతుందో వేచి చూడాల్సిందే.



మట్టి తోలుతున్న ప్రాంతానికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి తదితరులు

ఆత్మకూరులో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్



క్రీడాజ్యోతిని వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులో క్రీడా సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆదివారం 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలను జ్యోతిని వెలిగించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 39 టీమ్‌లకు సంబంధించిన 546 మంది క్రీడాకారులు, 72 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ విద్యార్థులంతా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించి జాతీయస్థాయిలో రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఆత్మకూరులో జరిగే నెట్‌బాల్ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు, మన రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపికయ్యే బృందానికి జెర్సీలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలతో నేలకొరిగిన వృక్షాలు...!

విలువైన కలప మాయం



రామానాయుని చెరువులో నేలకొరిగిన చెట్లు

గుర్రంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల ఆగడాలకు రామానాయుని చెరువులో విలువైన వృక్షాలు నేలకొరిగాయి. అక్రమార్కుల ఇసుకను ఎక్స్‌కవేటర్లతో తవ్వే సమయంలో అడ్డుగా ఉన్న నీలగిరి, నల్లతుమ్మ చెట్లను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో లక్షల విలువైన నల్లతుమ్మ, నీలగిరి చెట్లను నేలమట్టం చేశారు. వీటిని అక్రమార్కులు ఇటుక బట్టీలు, కలప వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తరిగొండ రామానాయునిచెరువులో వందల సంఖ్యలో నల్లతుమ్మ, నీలగిరి చెట్లున్నాయి. ఈ చెరువులో కొద్ది రోజులుగా ఇసుకాసురులు ఇసుకను తరలిస్తున్నారు. చెరువులో మట్టిపొరలను తొలగించి ఇసుకను తరలింపులో అడ్డుగా ఉన్న నీలగిరి, నల్లతుమ్మ చెట్లను ఎక్స్‌కవేటర్లతో నేలకొరిగించారు. ఇలా నేలమట్టమైన భారీ చెట్లను ఇసుక వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా ఇటుక బట్టీలు, కలప వ్యాపారులకు విక్రయించి వేలాది రూపాయలను సొమ్ము చేసుకున్నారు. మొద్దులు సైతం కనబడకుండా తొలగించి ఆనవాళ్లు లేకుండా చేయడం విశేషం. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా రామానాయుని చెరువులో ఉన్న నల్లతుమ్మ, నీలగిరి చెట్లను ఇసుకాసురులు నేలమట్టం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువులో నేల మీదపడిన చెట్లను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

యూఐఎఫ్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు

కురబలకోట, నవంబరు 10: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అమెరికా స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ యూఐఎఫ్ ప్రోగ్రాంకు నలుగురు మిట్స్ విద్యార్థుల ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ(ఏఐ) సాయిచరణ్‌రెడ్డి, సీఎస్ఈకి చెందిన దేవిక్ష సంహిత, జ్యోతి, వెంకట్‌రెడ్డి సిరిరెడ్డి ఎంపికయ్యారు. ఏటా స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో యూఐఎస్ కార్యక్రమాన్ని నిర్వహించగా వచ్చే ఏడాది యూరప్-నెదర్లాండ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ ట్వెంటే నిర్వహించనున్నారు. కాగా 13దేశాల్లో 44ఉన్నత విద్యాసంస్థల నుంచి 164మందిని ఎంపిక చేశారు. వీరు 2025లో ఏప్రిల్‌లో వారం రోజుల పాటు యూనివర్శిటీ ఆఫ్ ట్వెంటేని సందర్శించి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కావాల్సిన అంశాలను తెలుసుకుంటారన్నారు. ఇప్పటి దాకా స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోషిప్‌కు కళాశాల నుంచి 60మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, యాజమాన్యం, ఇంటర్‌నేషనల్ సెల్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

'కనువిప్పు' విజయోత్సవాలు



మునిగోపాలకృష్ణ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కథారచయిత కృష్ణమూర్తి, డైరెక్టర్ రాజా ఆధ్వర్యంలో నిర్మించిన కనువిప్పు షార్ట్‌ఫిల్మ్ విజయోత్సవాలు ఘనంగా జరిగాయి. జీఆర్టీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఫిల్మ్‌లతో యువతకు అవగాహన కల్పించవచ్చని తెలిపారు. అనంతరం మునిగోపాలకృష్ణ దంపతులను సన్మానించారు. ఏపీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ మునిరత్నం, వీఎం నాగరాజు, కరుణాకర్, ఉస్మాన్ సాహెబ్, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, ప్రొఫెసర్ శ్రీనివాసులు నాయుడు, ధనలక్ష్మీ, రచయితల సంఘం యుగంధరాచారి, రాంమోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

14న సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన ప్రజాపోరు పట్టణంలో ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రారంభించారు. నీరుగట్టువారిపల్లెలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. 14న కలెక్టరేట్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. అధిక ధరలు నియంత్రణ చేసి నిత్యావసరాల ధరలను అదుపులోకి తీసుకురావాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక, ఒకే నేత ఉండాలని దేశంలో జమిలీ ఎన్నికలను తీసుకురావాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు వైసీపీ ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తే టీడీపీ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని వాపో యారు. సీపీఎం నేతలు హరిశర్మ, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో నాటుసారా విక్రయిస్తున్న ఎం.గౌతమ్‌ను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. నగరవనం వద్ద బసినికొండ వాసి సత్యనారాయణ కుమారుడు గౌతమ్ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు చేశామన్నారు. అతని వద్ద 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జోర్నాస్, హెచ్‌సీ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఉచితం... రవాణా అక్రమం

యంత్రాలతో తోడుతున్న వైనం ● ట్రాక్టర్లతో మదనపల్లెకు, టిప్పర్లతో బెంగళూరుకు తరలింపు



పోలీసులకు పట్టుబడిన టిప్పర్

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఇసుక ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటి నుంచీ బాహుదా కాల్వల్లో ఇసుకను ఎక్స్‌వేటర్లు, హిటాచిలతో తోడి అక్రమంగా మదనపల్లి, బెంగళూరుకు తరలిస్తున్నారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను తరలించుకోవచ్చని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో అక్రమార్కుల అవినీతికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. అయితే నిమ్మనపల్లి మండలంలో ఎలాంటి రీచ్‌లు లేకపోగా బాహుదా కాల్వ నుంచే అక్రమంగా ఇసుకను తోడి రోజుకు దాదాపు 50వరకు ట్రాక్టర్లు, 6 టిప్పర్లు ద్వారా మదనపల్లి, బెంగళూరుకు తరలిరచి సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లి సమీప బాహుదా కాల్వలో పొలానికి ఇసుకను తరలిస్తుంటే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుక వ్యాపారులు అదే పనిగా ఇసుకను అమ్ముకుంటున్నా అధికారులకు తెలియలేదంటే అతిశయోక్తి కాదు. రోజూ ఉదయం మదనపల్లి నుంచి దాదాపు పది ట్రాక్టర్ల వరకు నిమ్మనపల్లి బాహుదా కాల్వలో ఇసుకను తరలిస్తుండగా రాత్రి 12గంటలకు టిప్పర్లతో బెంగళూరుకు తరలిస్తున్నారు. పక్షం రోజుల కిందట నిమ్మనపల్లి ఎస్ఐ తిప్పేస్వామి ఒక టిప్పర్‌ను పట్టుకుని మదనపల్లికి చెందిన యజమాని అశోక్, డ్రైవర్ శంకర్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేశారు. ముష్టూరు, అగ్రహారం, తవళం, కొండయ్యగారిపల్లి, నిమ్మనపల్లి పంచాయతీ సమీప కాల్వలు, వాగుల్లో నిత్యం ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ట్రాక్టర్లతో ఇసుకను తరలించేందుకు అనుమతిస్తే దీన్ని అదునుగా తీసుకుని ఇసుక అక్రమ రవాణా దారులు రెచ్చిపోతున్నారు. దీనిపై సంబంధిత తహసీల్దార్ ధనంజుయులను వివరణ కోరగా మండలంలో ఇసుక రీచ్‌లు లేవని ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చొరవచూపి ఆసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి వుంది.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



జిల్లా కార్యదర్శి ఆర్ఎం బాబ్జిని సన్మానిస్తున్న తహసీల్దార్లు

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎం బాబ్జి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఎన్నికల అబ్జర్వర్ విజయశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నరసింహ కుమార్, ప్రధాన కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు అమరనాథ్, సయాద్‌అహ్మద్, ఫిరోజ్‌ఖాన్, డీటీలు నవీన్, అస్లాంబాషా, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి



సీపీ బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ జయంతి వేడుకలను ఆదివారం వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా చేసుకున్నారు. స్థానిక ఉర్దూ ప్రైమరీ బాలికల పాఠశాలలో సీపీ బ్రౌన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన తెలుగు భాషా పరిశోధనకు చేసిన కృషి, ప్రాచీన కావ్యాలు, అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు సోఫియాబేగం, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పు జయంత్యుత్సవాలు



టిప్పుసుల్తాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివప్రసాద్

మదనపల్లె అర్బన్/వాల్మీకిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ జయంతిని మదనపల్లె, వాల్మీకిపురంలో వేడుకగా చేశారు. మదనపల్లె బెంగళూరు బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో తన ఖడ్గంతో బ్రిటీష్ సైన్యాన్ని చీల్చి చెండాడిన మైసూర్ టైగర్ టిప్పు సుల్తాన్ అని కొనియాడారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర నేత టీఏ పీర్‌బాషా, షాహీద్ బేగ్, ముద్దస్సిర్, మన్సూర్, అస్లాం, ఇమ్రాన్, బాస్ నేతలు ముత్యాల మోహన్, నీరుగట్టు రమణ, రెడ్డిప్రసాద్, ఇర్ఫాన్, తలారికృష్ణ, గంగాధర్, రవిశంకర్, రాయల్‌సూరి తదితరులు పాల్గొన్నారు.

టిప్పుసుల్తాన్ 275 జయంత్యుత్సవాలను వాల్మీకిపురం జామియా మసీదు వద్ద టిప్పు సుల్తాన్ యూత్ కమిటీ, మత పెద్దలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బ్రిటీష్ వారితో పోరాడుతూ ప్రాణాలను సైతం లెక్కలేక స్వాతంత్ర్య పోరాటం చేసి చరిత్రలో నిలిచిపోయిన పోరాట యోధుడు టిప్పు సుల్తాన్ అని కొనియాడారు. ముతవల్లి అబ్దుల్‌అజీం, యూత్ కమిటీ అధ్యక్షుడు రియాజ్, సభ్యులు కలీమ, బాబు, ఫయాజ్, షబ్బీర్, మురాషా, జావీద్, ఇర్ఫాన్, 'అషర్, మున్వర్, జంషీద్, సయ్యద్‌బాషా, చాను, సాదిక్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పాత జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మదనపల్లె సాయి సంజీవిని కిడ్నీ స్టోన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఈ శిబిరంలో యూరాలజీ, కిడ్నీ, ప్రొస్టేట్, గైనిక్ సమస్యలు, అపెండిక్స్, హెర్నియా, ఫైల్స్, ఫిస్టులా, థైరాయిడ్, తదితర వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. మండల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేశాలు దానం చేసిన విద్యార్థిని అనన్య



కేశాలు దానం చేస్తున్న విద్యార్థిని

మదనపల్లె అర్బన్, నవం బరు 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు మానసికంగా తోడై నిలవాలని హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన కార్యక్రమంలో ఆరోతరగతి విద్యార్థిని అనన్య తన కేశాలను దానం చేసింది. మదనపల్లె వాసులు గోపాలకృష్ణ అరుణ దంపతుల కుమార్తె అనన్య హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా కేశాలను దానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అబూబక్కర్ సిద్దిక్ విద్యార్థినికి పూలమొక్కలు, ప్రశంసాపత్రాన్ని అందించారు. అనంతరం ఐదుగురు క్యాన్సర్ బాధితులకు వారు విగ్గులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు : టీడీపీ



మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇతరుల వ్యక్తిత్వ హననం చేసేలా పోస్టులు పెడితే ఎవరైనా సరే మూల్యం చెల్లించుకోక తప్పదని రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుమార్తెను కించపరిచేలా కొందరు వైసీపీ నేతలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని గుర్తు చేశారు. ఇటువంటి పోస్టులపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా వున్నారని అసభ్య పోస్టులు పెట్టిన వారెవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, రవి, శివకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో బారికేడ్లు ఏర్పాటు



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సీఐ చాంద్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో భాగంగా అనంతపురం- చైన్నై జాతీయ రహదారిపై వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అమ్మచెరువుమిట్ట వద్ద భారీగా ప్రమాదాలు జరుతుండడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడానికి, ప్రమాదాల నుంచి రక్షించడానికి వీటిని ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి దుప్పట్లు వితరణ

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తీతవగుంటపల్లెలో ఉన్న సాయికృప వృద్ధాశ్రమానికి పీలేరు మానవత సంస్థ సభ్యులు దుప్పట్లు వితరణగా అందజేశారు. సంస్థ చైర్మ న్ వి.రామచంద్ర, అధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యద ర్శి సురేశ్, సభ్యులు జగన్మోహన్, వైవీ రమణ, రాచపల్లె కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నేతలు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లెలో మండల నేత కట్టా సురేంద్ర నాయుడు, మేకల సుధాకర్‌రెడ్డితో కలిసి టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేశారు. సభ్యత్వంతో కలిగే ప్రయోజనాలను నేతలు కార్యకర్తలకు వివరించాలన్నారు. మండలాన్ని ముందు వరుసలో ఉండేలా సభ్యత్వాలను చేద్దామన్నారు. మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్ బాబు, మేకల సుధాకర్ రెడ్డి, పులికల్లు రామ్మూర్తి, తాడిగోళ్లపల్లె సుధాకర్ రెడ్డి, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన జనసేన నేత 'పోతుల'

క్షతగాత్రులను సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు

సకాలంలో వైద్యం చేయించి ముగ్గురి ప్రాణాలు కాపాడిన వైనం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పెద్దతిప్పసముద్రం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ తన సొంత వాహనంలో ఆస్పత్రికి తరలించి సకాలంలో వైద్య చికిత్స అందించి ముగ్గురి ప్రాణాలను కాపాడి మానవత్వం చాటుకున్నారు. వివరాలకు బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లె వాసులు మునిరాజ్, లక్ష్మన్న, నీరజ్‌సాయి బైక్‌లో సొంత పనుల నిమిత్తం వేపూరికోటకు వచ్చారు. వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మరో వాహనం వెనుక నుంచి ఢాకొంది. దీంతో ద్విచక్రవాహనంలో వెళ్తున్న వీరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వెళ్తున్న జనసేన తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ సంఘటనను గమనించాడు. ప్రమాదంలో గాయపడిన వారిని సొంత వాహనంలో మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిరు. క్షతగాత్రులను సమయస్ఫూర్తితో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించేందుకు సహకరించి మానవత్వాన్ని చాటుకున్న సాయినాథ్‌ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మరోసారి నియమితులయ్యారు. ఆదివారం ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాష్ట్ర వ్యాప్తంగా పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై

అసెంబ్లీలో చర్చించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 104 ఉద్యోగుల సమస్య లు పరిష్క రిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చినా, ఇప్పటికీ ఆ అంశంపై స్పందించలేదన్నారు. అరకొర వేతనాలు సకాలంలో చెల్లించకపోగా, జీఓనెంబర్ 7 ప్రకారం కనీస వేతనం అమలు చేయక పోవడం మోసం చేయడమేనన్నారు. 104 ఉద్యోగులు రాజు, విశ్వనాథరెడ్డి, నాగార్జున, వినయ్, వంశీ, విశ్వనాథ్, రాము, సోము, శ్రీనివాసులు, రాజశేఖర్, మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ పీలేరు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. 15న ఉదయం 6 గంటలకు పీలేరులో బయలుదేరి 10 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత రాత్రి 8 గంటలకు బస్సు బయలు దేరుతుందని ఆయన తెలిపారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రానుపోను టికెట్టు ధర రూ.700లు అని ఆయన తెలియజేశారు. టికెట్టు కావాల్సిన వారు తమ సంస్థ వెబ్‌సైట్ ద్వారాగానీ స్థానిక బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లోగానీ బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9959225679, 9014200628 సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మదనపల్లె టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సొసైటీ కాలనీలో శ్రీదేవి హాస్పిటల్ వద్ద శని, ఆదివారాల్లో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ సాయిసంహిత మోటూరి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ చెన్నైకు చెందిన ప్రశాంత్ ఫెర్టిలిటీ రీసెర్చ్ సెంటర్, మారుతి హెల్త్‌హోమ్ శ్రీదేవి హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 124 మంది దంపతులు వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారన్నారు. వీరికి సంతానం కలిగేలా కౌన్సెలింగ్ ఇవ్వడం, అవసరమైన వారికి చికిత్సకు రెఫర్ చేశామన్నారు. డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మహతి, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో

నాగరాజుకు నాలుగు పతకాలు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో పెద్దతిప్పసముద్రం వాసి పూల నాగరాజు నాలుగు పతకాలను సాధించాడు. రాజమహేంద్రవరం మునిసిపాలిటీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 మంది పాల్గొనగా అందులో పీటీఎంకు చెందిన నాగరాజు నాలుగు పతకాలను సాధించాడు. విజేత నాగరాజును పలువురు అభినందించారు

నిందితుడిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): యువకుడిపై కత్తితో దాడి చేసిన బాబా ఇమ్‌ఖాసీంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సీటీఎం గ్రామం, సోమలగడ్డకు చెందిన షాజహాన్, చాంద్‌బేగమ్ కుమారుడు షేక్ ఖలీల్‌బాషాపై ఇమ్‌ఖాసీం కత్తితో పొడిచి గాయపరిచారు. సీటీఎంలోని స్థలాన్ని కాజేయడానికి ఖలీల్‌ను చంపాలనే యత్నంలో మిత్రులతో కలిసి వీడియోగేమ్ ఆడుతున్న అతన్ని కత్తితో పొడిచాడు. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారించాలి

రాజంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థి మోహిత్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నేత నందకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కేవీపల్లె గురుకులం ఘటనలో ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేసి సీబీఐ విచారణ చేయించాలని కోరారు. .

యువకుడికి తీవ్రగాయాలు

ఓబులవారిపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పడంతో దినేష్ తీవ్రంగా గాయపడినట్లు 108 సిబ్బంది తెలిపారు. జీవీ పురం అరుంధతీవాడ యువకుడు ఓబులవారిపల్లె నుంచి ఇంటికి వెళుతుండగా బైక్ కిందపడడంతో తలకు దెబ్బ తగిలింది.

లాటరీ టికెట్లు అమ్ముతున్న ఐదుగురు అరెస్టు

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): లాటరీ టికెట్లు అమ్ముతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. బెంగళూరు బస్టాండ్ వద్ద లాటరీ టికెట్లు అముతున్నట్లు సమాచారం అందడంతో టూటౌన్ ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో వెళ్లి 420 టికెట్లను స్వాధీనం చేసుకుని గౌస్‌పీర్, ఇబ్రహీం, మహ బూబ్‌బాషా, రెడ్డిప్రసాద్, మహమ్మద్‌అలీని అరెస్టు చేసి నట్లు సీఐ తెలిపారు.

బంగారు నగల దొంగతనంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): బంగారు నగలు దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కొండామర్రిపల్లె గ్రామం, దేవతానగర్ వాసి వెంకటేష్ భార్య మల్లకుంట్ల రాధమ్మ ఇంట్లో గత నెల 24న డైనింగ్ టేబు ల్‌పై ఉంచి మర్చిపోయిన నగలు కన్పించలేదని 3న గుర్తించింది. నగలను ఎవరో దొంగలించినట్లు గుర్తించింది. రాధమ్మ ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.